



వైభవంగా వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ

ఆగిరిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోవిందా.. గోవిందా.. లక్ష్మీనరసింహస్వామి గోవిందా అను నామస్మరణం ఆగిరిపల్లిలో శోభనగిరి చుట్టూ మారుమోగింది. శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవ కృత్తిక దీపోత్సవంలో భాగంగా మూడో రోజు ఆదివారం వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమై శోభనగిరి చుట్టూ సుమారు 3 కి.మీ దూరం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివార్లు దేవాలయానికి చేరుకున్న అనంతరం లక్ష్మీ నరసింహ సుదర్శన మూల మంత్ర శాంతి హోమం, తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లకు విశేష అర్చన, శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర శత రజిత పుష్పార్చన, నిత్య హోమం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో సీహెచ్ సాయి, అర్చకులు వేదాంత శేషుబాబు, అనంతకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ సారైనా వస్తారా..?

- ఏపీ నిట్ డైరెక్టర్ కోసం అక్టోబరు 30న ఇంటర్వ్యూలు నిర్వహించిన కమిటీ
- రాష్ట్రపతి పరిశీలనకు ముగ్గురి పేర్లు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌కు డైరెక్టర్ నియామకంపై కేంద్రం కసరత్తు చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నియమించిన కమిటీ అక్టోబరు 30న ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఏపీ నిట్ డైరెక్టర్ కోసం 85 మంది ప్రొఫెసర్‌లు దరఖాస్తు చేసుకున్నారు. దేశంలోని ఐఐటీ, నిట్‌లలో పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. ఇంటర్వ్యూలు పూర్తి కావడంతో అందులో ముగ్గురిని ఎంపిక చేసి కేంద్ర విద్యాశాఖకు కమిటీ నివేదిక పంపనుంది. అదే నివేదికను రాష్ట్రపతికి పంపనున్నారు. అందులో ఒకరిని రాష్ట్రపతి నియమిస్తారు. మూడేళ్లుగా ఏపీ నిట్ డైరెక్టర్ పదవి ఖాళీగా ఉంది. ఇన్‌చార్జిలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఏపీ నిట్‌లో కేంద్రం మంజూరు చేసిన బోధన, బోధనేతర సిబ్బందిని భర్తీ చేయలేకపోతున్నారు. మరోవైపు ఏపీ నిట్ అభివృద్ధి కోసం రూ.400 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. వాటికి కూడా మోక్షం లభించడం లేదు. రెగ్యులర్ డైరెక్టర్ వస్తేనే ఇటువంటి సమస్యలు పరిష్కారం కానున్నాయి. ఫ్యాకల్టీ తక్కువగా ఉందని, సరిపడా వసతి సౌకర్యం లేదంటూ సీట్ల సంఖ్యను 750 నుంచి 480కి కుదించారు. విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ కల్పించడానికి మంచి కంపెనీలు రావాలంటే డైరెక్టర్ ఉండాలి. డైరెక్టర్ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న ఆశావహులకు ఇంటర్వ్యూలు పూర్తి కావడంతో రాష్ట్రపతి నిర్ణయం కోసం అంతా ఎదురు చూస్తున్నారు.

వాహనాల తనిఖీలు

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ ఆదేశాల మేరకు జిల్లాలో ఆదివారం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అతి వేగం ప్రమాదకరమని జాతీయ, రాష్ట్రీయ రహదారులపై రాంగ్ రూటులో వాహనాలు నడపరాదని సూచించారు. వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులు ఉండాలన్నారు. ముఖ్యంగా వాహనం నడిపేవారికి డ్రైవింగ్ లైసెన్సు ఉండాలని, ఆ వాహనానికి ఇన్సూరెన్సు ఉండాలన్నారు. అనుమతికి మించి ఎవరిని ఎక్కించుకోకూడదని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన రికార్డులు లేని వారికి ఈ-చలానాలు విధించారు.

భగ్గుమన్న కూరగాయల ధరలు

■ లోపలి పేజీలో..

అన్నీ కిలో రూ.60 పైనే.. వంకాయలు కిలో రూ.120

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్

ఏలూరు, నవంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో, డివిజన్, మండల కేంద్రాల్లో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని యథావిధిగా ఈనెల 3న నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లోనూ వినతులను ఉదయం 10 గంటల నుంచి స్వీకరిస్తామని, ప్రజలు ఆన్‌లైన్‌లో, వెబ్‌సైట్ ద్వారా కూడా వినతులను పంపవచ్చని వివరించారు.

నూజివీడు మునిసిపల్ కమిషనర్ బదిలీ

నూజివీడు టౌన్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డిని బదిలీ చేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ఏపీ సెక్రటేరియట్‌లో పని చేస్తున్న కె.వీరయ్యను నియమిస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వెంకట్రామిరెడ్డిని రాష్ట్ర పురపాలకశాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీవారి జల విహారం

■ లోపలి పేజీలో..

చిగురించిన ఆశలు!

ఏటా గోదావరి వరదలు వస్తే పిల్లా పాపలతో తట్టాబుట్టా సర్దుకుని మెరక ప్రాంతాలకు తరలి వెళ్లాలి.. రహదారులు మూసుకుపోతాయి. లోతట్టు ప్రాంతంలో ఉన్న ఆ గ్రామాలను 41.15 కాంటూరు లెవెల్‌లో చేర్చి పరిహారం అందించాలి. కానీ గత ప్రభుత్వ నిర్లక్ష్యం, క్షేత్రస్థాయిలో ముంపును గుర్తించకుండా అధికారుల ఉదాసీనత కారణంగా వేలాది మంది నిర్వాసితులకు పరిహారం అందని పరిస్థితి ఏర్పడింది. తాజాగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల ప్రకటనతో ఆ గ్రామాల నిర్వాసిత కుటుంబాల్లో ఆశలు రేకెత్తాయి.

\- కుక్కునూరు



45.72 కాంటూరు లెవెల్ ముంపు గ్రామాలకూ పరిహారం

- మంత్రి నిమ్మల హామీతో నిర్వాసితుల్లో సంతోషం
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- సరిదిద్దుతున్న కూటమి ప్రభుత్వం

వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అన్యాయం

వాస్తవానికి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం 45.72 కాంటూరు లెవెల్‌లో నిర్మాణం చేపట్టారు. అందుకు అనుగుణంగా భూసేకరణ, నిర్వాసితులకు పునరావాస ప్రక్రియ చేపట్టారు. కానీ గత వైసీపీ ప్రభుత్వం అనూహ్యంగా 41.15 కాంటూరు లెవెల్‌ని తెర మీదకు తీసుకొచ్చింది. ఏటా గోదావరి వరద ముంపునకు గురవుతున్న పలు గ్రామాలను 41.15 కాంటూరు లెవెల్‌లో ముంపనకు గురవుతున్నట్టు గుర్తించలేదు. కొన్ని గ్రామాలు వరద ముంపునకు గురి కానప్పటికి వాటిని 41.15 కాంటూరు లెవెల్‌లో చేర్చి పరిహారం అందించడంతో బాధిత నిర్వాసితులు విస్తుబోయారు.

ఆదుకుంటాం.. మంత్రి నిమ్మల హామీ

కుక్కునూరు మండలంలో బీ,సీ,డీ బ్లాక్‌లు పెద్దగూడెం, ఉప్పరిమద్దిగట్ల, ముత్యాలమ్మపాడు, కౌండిన్యముక్తి, మాధవరం, ఎల్లప్పగూడెం, అంబోతులగూడెం, చెరువుకొమ్ముగూడెం, సీతారామనగరం, వెంకటాపురం ఎస్సీ కాలనీ, శ్రీధర తదితర గ్రామాలు ఏటా గోదావరి వరదకు ప్రభావితం అవుతున్నాయి. ఈ గ్రామాలేవి 41.15 కాంటూరులో లేవు. ఇదే పరిస్థితి అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం, మిగిలిన ముంపు మండలాల్లోను ఉంది. గత వైసీపీ ప్రభుత్వ నిర్వాహం వల్ల 41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న గ్రామాలకు మాత్రమే పరిహారం ఇచ్చి 45.72 కాంటూరు లెవెల్‌లో ఉన్న గ్రామాలకు పరిహారం ఇవ్వరు అనే భావనలో నిర్వాసితుల్లో నెలకొంది. కానీ 45.72 కాంటూరు లెవెల్‌లో ఉన్న గ్రామాలు కూడా పరిహారం ఇస్తామని వేలేరుపాడులో శనివారం జరిగిన పరిహారం అందజేత సభలో మంత్రి నిమ్మల హామీ ఇవ్వడంతో నిర్వాసిత గ్రామాల్లో సర్వత్ర హర్షం వ్యక్తమవు తోంది. '41.15 కాంటూరు లెవెల్‌లో ఉన్న గ్రామాలకు పూర్తి స్థాయిలో పరిహారం అందజేస్తున్నాం. ఇక 45.72 కాంటూరు లెవెల్‌లో ముంపు గ్రామాలపై దృష్టి పెట్టి పరిహారం చెల్లిస్తాం' అంటూ ఆయన స్పష్టం చేయడంతో తమకు సైతం (మిగతా 8వ పేజీలో)

మా గ్రామం ముంపులో లేదు



మా గ్రామం కుక్కునూరు పంచాయతీలో ఉంది. గోదావరి వరద కారణంగా గుండేటివాగు ప్రభావంతో మా గ్రామం ముంపునకు గురవుతుంది. అయినా ముంపులో చేర్చలేదు. ఇప్పుడు 45.72 కాంటూరులో చేర్చి పరిహారం ఇవ్వాలి.

\- కొవ్వాసి నాగార్జున, వంజ్యంవారిగుంపు

మేము మునుగుతున్న పరిహారం లేదు



గోదావరి వరదలకు మునుగుతున్న మా గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చకుండా 45.72 పరిధిలో చేర్చారు. దీంతో మాకు అన్యాయం జరిగింది. ఇప్పుడు మంత్రి ఇచ్చిన హామీతో మాకు న్యాయం జరిగే అవకాశం ఉంది.

\- ఎన్.నాగరాజు, బెస్తగూడెం



స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న ఈవో మూర్తి

భక్తులకు మెరుగైన సేవలు అందించండి

- చినవెంకన్న ఆలయ అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చినవెంకన్న ఆలయానికి వచ్చే భక్తులకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆలయ అధికారులను ఆదేశించారు. శ్రీవారి ఆలయాన్ని ఆదివారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి స్వామి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. అనంతరం ఆమె ఆలయంలోని పలు విభాగాలను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. వంటశాలను, ప్రసాదాల తయారీ విభాగాన్ని, అన్నప్రసాద భవనాన్ని పరిశీలించారు.

పర్యావరణ పరిరక్షణకు ఆలయ అధికారుల చర్యలు భేష్..

సంప్రదాయేతర ఇంధన వనరులను సమర్థవంతంగా వినియోగిస్తున్న దేవాలయ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి అభినందించారు. గోశాలను, బయో గోబర్ గ్యాస్ ప్లాంట్‌ను పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలను అభినందించారు. ఆలయ డీఈ టి.సూర్యనారాయణ మాట్లాడుతూ తమ ఆలయంలో బయోగ్యాస్ 4 టీపీడీ సామర్థ్యానికి సరిపడా ముడిసరుకు అందుబాటులో ఉందని, ఆ మేరకు ప్లాంట్‌ను మంజూరు చేయించాలని కోరగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

తీరని చింత!



కదలిక లేని చింతలపూడి ఎత్తిపోతల పథకం

- అడ్డంకిగా ఉన్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు
- గత వైసీపీ సర్కార్ నిర్వాకంతో ఆగిన పనులు
- ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో చేర్చిన కూటమి ప్రభుత్వం .. అయినా కదలిక లేని వైనం
- ఆయకట్టు రైతుల్లో నిరాశ

ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలలో ఐదు లక్షల ఎకరాల మెట్ట భూములను గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయడంతో పాటు కొన్ని వందల గ్రామాలకు తాగునీరు సమస్యను తీర్చే చింతలపూడి ఎత్తిపోతల పథకం పనుల కు మోక్షం ఉందా? లేదా? అని ఆయకట్టు రైతులు ఆశ-నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు తట్ట మట్టి వేయకుండా పథకాన్ని భ్రష్టు పట్టించింది. కూటమి ప్రభుత్వంపైనే ఆయకట్టు రైతులు ఆశలు పెట్టుకున్నారు.

చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చింతలపూడి పథకం ఫేజ్-1కి 2008లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన జరిపారు. అనంతరం టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.4,909 కోట్లతో (1,2 ఫేజ్‌లు) పనులు చేపట్టారు. అప్పటి సీఎం చంద్రబాబు ఫేజ్-2కి 2017 సెప్టెంబరు 17న ప్రస్తుత ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట సమీపంలోని మొద్దుల పర్వ వద్ద శంకుస్థాపన చేశారు. టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని సుమారు 60 శాతం పనులు పూర్తి చేసింది. ఆపై వైసీపీ అధికారంలోకి రావడంతో పథకానికి దుర్దశ పట్టింది.

జగన్ ప్రభుత్వం తప్పిదాలు..ఆగిన పథకం

జగన్ ప్రభుత్వం తప్పిదాల వల్ల కూటమి ప్రభుత్వం పథకంపై ముందుకు వెళ్లలేకపోతుంది. చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పర్యావరణ అనుమతులు లేకుండా చేస్తున్నారని 2018లో ఉంగుటూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి దివంగత వట్టి వసంతకుమార్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై ట్రిబ్యునల్ విచారణ జరిపిన 2022లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.73 కోట్లు జరిమానా విధించింది. దీనిపై అప్పటి జగన్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. విచారణ జరిపిన సుప్రీంకోర్టు మూడు నెలలు గడువు ఇచ్చి జరిమానా చెల్లించడం లేదా పర్యావరణ అనుమతులు తీసుకోవాలని ఆదేశించింది. దీనిని వైసీపీ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోకపోవడంతో సుప్రీంకోర్టు వర్క్ స్టాప్ ఉత్వర్వులు ఇచ్చింది. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది.

ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో చేర్చినా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదు ప్రాధాన్యత ప్రాజెక్టులలో చింతలపూడిని చేర్చింది. కానీ పనులు పునః ప్రారంభం ఎప్పుడు జరుగుతుందో తెలియని పరిస్థితి. ఫేజ్-1 పరిధిలో నిర్వాసిత రైతులు ఎక్కువ నష్ట పరిహారం కోసం కోర్టులో వేసిన 20 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఫేజ్-1లో నిర్వాసిత రైతులకు సుమారు రూ.100 కోట్లు, ఫేజ్-2లో సుమారు రూ.25 కోట్లు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. ఈ పథకం పూర్తయితే పోలవరం, చింతలపూడి, దెందులూరు, గోపాలపురం, మైలవరం, తిరువూరు, నూజివీడు, నందిగామ, గన్నవరం అసెంబ్లీ నియోజక వర్గాలలో ఐదు లక్షల ఎకరాలకు నీరందుతుంది. రాష్ట్ర విభజన అనంతరం నాగార్జున సాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్‌పీ) ఎడమ కాలువ ద్వారా తెలంగాణ దాటి ఆంధ్ర ప్రాంతానికి సాగర్ జలాలు రావడం కష్టంగా మారింది. ఎన్ఎస్‌పీ జోన్-3 కాలువకు తెలంగాణ నుంచే సాగునీరు (మిగతా 8వ పేజీలో)



చాట్రాయి మండలం చీపురుగూడెం వద్ద తమ్మిలేరుపై నిర్మించిన అసంపూర్తి అక్విడెట్

చేప పిల్లలకు భలే డిమాండ్



శీలావతి చేప పిల్లలు

కలిదిండి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వనామి రొయ్య నుంచి చేపల సాగువైపు ఆక్వా రైతులు మక్కువ చూపుతుండడంతో చేప పిల్లలకు డిమాండ్ పెరిగింది. రొయ్యల సాగులో నష్టాల రావడంతో చాలా మంది రైతులు ప్రస్తుతం వాణిజ్య పరంగా ఎక్కువ డిమాండ్ ఉన్న శీలావతి, బొచ్చె, ఫంగస్ వంటి రకాల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. శీలావతి రకం అంగుళం సైజు చేప పిల్ల రూ.1.50 పైసలు ధర ఉంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల ఎకరాల్లో చేపల సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు కారణంగా వనామి రొయ్యలకు వైరస్ సోకడంతో పాటు ఆక్సిజన్ కొరత ఏర్పడి వేలాది ఎకరాల్లో రొయ్యలు మృత్యువాత పడి లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లింది. దీంతో నికర ఆదాయం లభించే చేపల సాగు మేలని రైతులు భావిస్తున్నారు. చేపల సీడ్ హేచరీలు మన ప్రాంతంలో పరిమితంగా ఉన్నాయి. ఇక్కడ రైతులకు అవసరమైన సీడ్ చెన్నై, నెల్లూరు, కాకినాడ, ప్రకాశం జిల్లాల నుంచి తీసుకొస్తారు. బాగా చిన్న సైజు చేపల పిల్లలను తీసుకొచ్చి స్థానిక చెరువుల్లో పెంచుతారు. నెల రోజుల్లో ఎదిగిన సైజును రైతులకు విక్రయిస్తారు. ప్రస్తుతం శీలావతి చేప పిల్ల అంగుళం సైజు రూ.1.50 పైసలు పలుకుతోంది. ఇంకా పెద్ద సైజు ఉంటే రూ.2 నుంచి రూ.5 ధర ఉంది.

జీరో పాయింట్ చేప పిల్లలకు గిరాకీ

ప్రస్తుత చేపల చెరువుల్లో జీరో పాయింట్ చేప పిల్లలను రైతులు ఎక్కువగా వేస్తున్నారు. పావు కిలో ఉన్న చేప పిల్లను జీరో పాయింట్‌గా పిలుస్తారు. కిలోల చొప్పున వీటిని విక్రయిస్తారు. జీరో పాయింట్ చేప పిల్ల రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. వీటిని పెద్ద చెరువుల్లో ఎకరాకు 3 వేలు నుంచి 4 వేలు వరకు వేస్తున్నారు. ఆరు నెలల్లో కిలో నుంచి కిలోన్నర వరకు పెరుగుతుండడంతో సంవత్సరానికి రెండు పట్టుబడులు చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధరల లభించి లాభాలను పొందుతున్నారు. చిన్న సైజు అంగుళం నుంచి 2 అంగుళాల చేప పిల్లలను సంవత్సరం పాటు పెంచడం వల్ల పెట్టుబడి వ్యయం పెరిగి నష్టం వస్తుండడంతో జీరో పాయింట్ చేప పిల్లల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు.

శీలావతి, బొచ్చెకు డిమాండ్

వాణిజ్యపరంగా శీలావతి, బొచ్చెకు డిమాండ్ ఉంది. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో శీలావతి, బొచ్చె చేప పిల్లల కొనుగోలును ముమ్మరం చేశారు. ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని చిన్న చెరువుల్లో జీరో పాయింట్ పెంచి తిరిగి పెద్ద చెరువుల్లో వదులుతున్నారు. తెల్ల చేపల ధరలు పెరగడంతో రొయ్యల చెరువులకు చేపల చెరువులుగా మార్పు చేసి చేపల సాగు విస్తరిస్తున్నారు.

మేతల ధరలను నియంత్రించాలి



పెద్ద చెరువుల్లో శీలావతి, బొచ్చె జీరో పాయింట్ చేప పిల్లలను వేస్తున్నారు. ఒక్కొ జీరో పాయింట్ (పావు కిలో) చేప పిల్ల రూ.12 చొప్పున కొనుగోలు చేస్తున్నాం. ఎకరానికి 32 వేలు చేప పిల్లలను వేస్తున్నాం. ఏప్రిల్ నెల కల్లా పట్టుబడికి వస్తాయి. ప్రస్తుతం పెద్ద చేపకు గిట్టుబాటు ధర లభిస్తుంది. చేపల మేతల ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- దున్న భోగేశ్వరరావు, ఆక్వా రైతు, పెదలంక

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు గోదావరి ఉపనదుల వరద జలాలతో గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగింది. ఆదివారం ప్రాజెక్టు నుంచి 3,66,704 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదల చేసినట్టు జలవనరులశాఖ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్‌వేలో 48 గేట్ల ద్వారా వరద జలాలు దిగువకు ప్రవహిస్తున్నాయి. స్పిల్‌వే ఎగువన 29.260 మీటర్లు, స్పిల్‌వే దిగువన 19.880 మీటర్లు నీటిమట్టం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

దిక్సూచి

క్యాట్ ఫైనల్ ప్రిపరేషన్
వేగం, కచ్చితత్వం ప్రధానం



ఐఐఎం సహా పేరొందిన మేనేజ్‌మెంట్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్ష క్యాట్(కామన్ అడ్మిషన్ టెస్ట్). ఈ టెస్ట్‌లో సాధించిన పర్సంటైల్‌తో నేరుగా ప్రవేశం లభించదు. అయితే ఆ కాలేజీలు అడ్మిషన్‌కు సంబంధించి పరిగణనలోకి తీసుకునే ప్రాతిపదికల్లో మొదటిది మాత్రం క్యాట్ పర్సంటైల్. తొలిసారి ఈ టెస్ట్ రాసే అభ్యర్థులు ఒకవైపు ఫైనలియర్‌లో చివరి అంకమైన ప్రాజెక్ట్ వర్క్ పనిలో ఉంటారు. మరోపక్క గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ టెస్టుల బిజీలోనూ ఉంటారు. వీటిలో క్యాట్‌కు పట్టుమని నెల రోజుల గడువు కూడా లేదు. ఈ నేపథ్యంలో క్యాట్ తొలిసారి రాస్తున్నవారికి తోడు ఒకింత అవగాహనతో ముందుకు సాగుతున్న వారి వరకు అభ్యర్థులంతా టెస్ట్‌కు సమర్థంగా సన్నద్ధం కావచ్చు. అందుకు ప్రధానంగా... క్యాట్‌లో అడిగిన అన్ని ప్రశ్నలూ సాల్వ్ చేయాల్సిన అవసరం లేదు. 40 నుంచి 50 శాతం ప్రశ్నలను సాల్వ్ చేయగలిగితే చాలు, మంచి స్కోర్ సాధించవచ్చన్నది నిపుణుల సూచన. క్యాట్‌లో ప్రధానంగా మూడు విభాగాలు - వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ), డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్(క్యుఎ) ఉంటాయి. ఒక్కో విభాగానికి సంబంధించి ప్రిపరేషన్ ఇలా ఉండేలా చూసుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (క్యుఎ)

- ఈ విభాగంలో వేగం అంతకు మించి కచ్చితత్వం ప్రధానం. ఆ రెంటికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా మంచి స్కోర్ సాధించాలి.
- అర్థమెటిక్, ఆల్జీబ్రా, జామెట్రీ, మోడ్రన్ మేథ్స్‌లోని కాన్సెప్ట్‌లను రివైజ్‌చేసుకోవాలి. కాన్సెప్ట్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించాలి.
- ఈ విభాగం సెక్షనల్ మాక్ టెస్టులను వారానికి రెండు లేదా మూడు చొప్పున చేయాలి.
- అన్ని టాపిక్స్‌లో కలిపి ప్రతి రోజూ 30 నుంచి 40 ప్రశ్నలను సాల్వ్ చేయాలి.
- త్వరితగతిని గుర్తుకు తెచ్చుకునేందుకు వీలుగా ఫార్ములా నోట్ బుక్‌ను మెయింటైన్ చేయాలి.
- గతం నిర్వహించిన ప్రశ్నపత్రాల్లో తరచూ అడుగుతున్న ప్రశ్నలను పదేపదే సాల్వ్ చేస్తుండాలి.

డేటా ఇంటర్‌ప్రెటేషన్ అండ్ లాజికల్ రీజనింగ్(డీఐఎల్ఆర్)

- రోజుకు కనీసం రెండు, మూడు సెక్షనల్ మాక్ టెస్టులను చేయాలి. ప్రతి సారి సాల్వ్ చేయడంలో కష్ట స్థాయిని పెంచుకుంటూ వెళ్ళాలి.
- డేటా టేబుల్స్, లాజికల్ పజిల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి సెట్‌కు టైమ్ సెట్ చేసుకోవాలి. అలా సాల్వింగ్ కోసం పట్టే సమయాన్ని తగ్గించుకోవాలి.
- ప్రతి మాక్ టెస్టులో దొర్లే తప్పులను విశ్లేషించుకోవాలి. సాల్వింగ్ నుంచి ఆలోచన, తుది నిర్ణయం వరకు ప్రతి చోట సాధారణంగా ఎదురవుతున్న తప్పులను ఒక దగ్గర నోట్ చేసుకోవాలి. అవి పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- చివరి వారానికల్లా పది, పదిహేను నిమిషాల్లో ప్రతి సెట్‌ను పూర్తి చేయగలగడం అన్నది లక్ష్యంగా పెట్టుకోవాలి. అదే సమయం 80 నుంచి 90 శాతం మేర కచ్చితత్వాన్నీ సాధించాలి.

వెర్బల్ ఎబిలిటీ అండ్ రీడింగ్ కాంప్రహెన్షన్(వీఏఆర్‌సీ)

- రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడంలో సరైన పాటవానికి తోడు నిలకడ సాధించాలి.
- రోజుకు కనీసం మూడు రీడింగ్ కాంప్రహెన్షన్ పాసేజ్‌లను చదవడాన్ని అలవాటు చేసుకోవాలి.
- పారా జంబుల్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.
- మాక్ టెస్టుల్లో అటు ఆ పరీక్ష, ఇటు వ్యక్తిగత ప్రతిభను సునిశితంగా విశ్లేషించుకోవాలి.

రైల్వేలో మెగా రిక్రూట్‌మెంట్

భారతీయ రైల్వే వివిధ పోస్టులకు వేర్వేరుగా నోటిఫికేషన్లు విడుదల చేసింది. టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాలు ఉన్నాయి. వివిధ అర్హతలకు తోడు నిర్దేశిత ఎంపిక ప్రక్రియ ఆధారంగా ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. సంక్షిప్తంగా ఆ వివరాలు దిగువ ఇస్తున్నాం.



నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (అండర్ గ్రాడ్యుయేట్)

ఖాళీలు 3058

- కమర్షియల్ కమ్ టికెట్ క్లర్క్: 2424
- అకౌంట్స్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 394
- జూనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 163
- ట్రైనీ క్లర్క్: 77

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 27

నాన్‌టెక్నికల్ పాపులర్ కేటగిరీస్ (గ్రాడ్యుయేట్)

ఖాళీలు 5810

- కమర్షియల్ కమ్ టికెట్ సూపర్‌వైజర్: 161
- స్టేషన్ మాస్టర్: 615
- గూడ్స్ రైలు మేనేజర్: 3416
- జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్: 921
- సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్: 638
- ట్రాఫిక్ అసిస్టెంట్: 59

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత. జూనియర్ అకౌంట్ అసిస్టెంట్ కమ్ టైపిస్ట్, సీనియర్ క్లర్క్ కమ్ టైపిస్ట్ పోస్టులకు ఇంగ్లీష్/హిందీ టైపింగ్‌లో ప్రావీణ్యం ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ ఆధారిత టెస్ట్(టైర్ 1, టైర్ 2)కు తోడు టైపింగ్ స్కిల్‌టెస్ట్/కంప్యూటర్ ఆధారిత ఆప్టిట్యూడ్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

ఇంకొన్ని

ఖాళీలు 2569

జూనియర్ ఇంజనీర్, డిపో మెటీరియల్ సూపరింటెండెంట్, మెటలర్జికల్ అసిస్టెంట్ పోస్టులకూ నోటిఫికేషన్ విడుదలైంది.
అర్హత: పోస్టును బట్టి సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిప్లొమా/ బీఎస్సీ డిగ్రీ పాసై ఉండాలి.
ఎంపిక: రెండు దశల్లో కంప్యూటర్ ఆధారిత టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్, రైల్వే మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక ఉంటుంది.
దరఖాస్తుకు ఆఖరు తేదీ: నవంబర్ 20

డిజైనింగ్ @ ఎన్ఐడి



దుస్తులు, పాదరక్షలు, వాచీ, హ్యాండ్‌బ్యాగ్ సహా ఏదైనా సరే, ఒక వస్తువుకు ఉండాల్సిన సాధారణ లక్షణాలు దెబ్బతినకుండా అందంగా, ఆధునికంగా మరింత ఉపయోగకరంగా తీర్చిదిద్దడాన్నే డిజైనింగ్ అంటాం. ఈ అంశానికి సంబంధించి మన దేశంలో అత్యున్నత శిక్షణ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి) అహ్మదాబాద్. దానికితోడు గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్ ఏర్పాటు చేశారు. తరవాతి రోజుల్లో విజయవాడ (ఆంధ్రప్రదేశ్), కురుక్షేత్ర(హర్యానా), భోపాల్(మధ్యప్రదేశ్), జోర్హాట్(రాజస్థాన్)లలో కూడా ఎన్ఐడి దేనికదిగా ఏర్పాటై గ్రాడ్యుయేట్ కోర్సును ఆఫర్ చేస్తున్నాయి. వీటన్నింటికి కలిపి అడ్మిషన్లకు ప్రకటన విడుదలైంది.

కేంద్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడి). డిజైన్ ఎడ్యుకేషన్, సంబంధిత పరిశోధనలో గ్లోబల్ లీడర్‌గా అవతరించాలన్నది ఎన్ఐడి లక్ష్యం. విభిన్న డొమైన్లు ఇక్కడ ఉన్నాయి. కోర్సు పూర్తయ్యేనాటికి సంబంధిత పరిశ్రమలో ఇమిడిపోయే వ్యక్తిగా విద్యార్థిని తీర్చిదిద్దుతారు.

బీ డిజైన్ సీట్లు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 128 సీట్లు; ఆంధ్రప్రదేశ్, హరియాణా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు 2005 జూలై 1న లేదా ఆ తరవాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2025-26 విద్యాసంవత్సరంలో ఇంటర్ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.

డీఏటీ వివరాలు: ప్రిలిమ్స్‌ను పేపర్ - పెన్సిల్/పెన్ విధానంలో నిర్వహిస్తారు. టెక్స్, విజువల్స్ అంశాల నుంచి ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో అడుగుతారు. పరీక్ష వ్యవధి వివరాలను అడ్మిట్‌కార్డ్‌లో తెలియజేస్తారు.

ఎం డిజైన్
ఎన్ఐడి, అహ్మదాబాద్ క్యాంపస్ గాంధీనగర్‌లో పీజీ క్యాంపస్, బెంగళూరులో ఆర్ అండ్ డి క్యాంపస్‌లో మాత్రమే ఎం డిజైన్ కోర్సును అందిస్తున్నారు. మొత్తం 14 డిసిప్లిన్లలో దీనిని అందిస్తున్నారు. వివరాలకు సంబంధిత బ్రోచర్ చూడవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యుఎస్ అభ్యర్థులకు రూ.3,000; మహిళలు రూ.2000, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 1
- **డీఏటీ ప్రిలిమ్స్ తేదీ:** డిసెంబర్ 21
- **ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** admissions.nid.edu

SCHOLARSHIP ALERT

Colgate Keep India Smiling Scholarship 2025-26

Description: An initiative of Colgate-Palmolive (India) Limited to provide financial assistance and support to individuals who are deserving and meritorious but may lack the resources to pursue their dreams.

Eligibility: Indian students who are currently enrolled in Bachelor of Dental Surgery (BDS) (any year) or Master of Dental Surgery (MDS) courses in a recognised government or private institute. Applicants must have scored at least 65% marks in Class 12. Students must have an overall score of above 60% in their BDS to apply for the MDS scholarship. The annual family income of the applicants from all sources must not exceed INR 8 lakh.

Prizes & Rewards: Scholarship of INR 75,000

Last Date to Apply: 09-11-2025

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/CKISSP7

buddy4study.com

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★




దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను

సుధీర్‌బాబు

"'జటాధర' చిత్రంలో నేను పోషించిన పాత్రను తెలుగులో ఇప్పటివరకూ ఎవ్వరూ చేయలేదు. నా సినిమా హిట్ అయితే అది నా కష్టంగా భావిస్తా. ఫ్లాప్ అయితే నా ఓటమిగా స్వీకరిస్తా' అని హీరో సుధీర్ బాబు అన్నారు. ఆయన కథానాయకుడిగా వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కించిన చిత్రం 'జటాధర'. సోనాక్షి సిన్హా హీరోయిన్. ఉమేశ్‌కుమార్ బన్సల్, శివిన్ నారంగ్ నిర్మించారు. ఈ నెల 7న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఇందులో దెయ్యాల్ని వేటాడే వ్యక్తిగా కనిపిస్తాను. సినిమా చాలా ఆసక్తికరంగా ఉంటుంది. శివుడి నేపథ్యంలో వచ్చే సీక్వెన్స్‌కు గూస్‌బంప్స్ పక్కా' అని తెలిపారు. 'జటాధర' సినిమాలో సుధీర్‌బాబు నటన అద్భుతంగా ఉంటుంది' అని శివిన్ నారంగ్ చెప్పారు. 'నాకు తెలుగు చిత్ర పరిశ్రమ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం విషయంలో సహకారం అందించిన ప్రతీఒక్కరికీ కృతజ్ఞతలు' అని ప్రేరణ అరోరా పేర్కొన్నారు.

స్టైలిష్ క్లైమాక్స్‌కు సిద్ధం



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. నయనతార కథానాయిక. ఈ సినిమాను షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్‌పై సాహుగారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను తారస్థాయికి తీసుకెళ్లాయి. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదలవుతున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి కీలక షెడ్యూల్ గురించి అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఆదివారం నుంచి చిరంజీవి, ఫైటర్స్ బృందంపై స్టైలిష్ క్లైమాక్స్‌ను షూట్ చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇది ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటుందని, విజువల్‌గా అద్భుత అనుభూతిని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ చిత్రంలో కథానాయకుడు వెంకటేశ్ ఓ అతిథి పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, డీఓపీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.

60వ వసంతంలోకి షారుక్


పరాఖాన్

బాలీవుడ్ బాద్‌షా షారుక్ ఖాన్ తన 60వ పుట్టినరోజును ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ముంబైలోని ఆయన నివాసం మన్నత్ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖులు, ఇతర సెలెబ్రిటీలతో కిక్కిరిసిపోయింది. ఫరాఖాన్, కరణ్ జోహర్, రాణి ముఖర్జీ తదితరులు షారుక్‌ను కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఎప్పటి లాగే ఈసారి కూడా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది అభిమానులు షారుక్ నివాసానికి తరలి వచ్చారు.

భయం కాదు.. విధ్వంసం

షారుక్ ఖాన్ కథానాయకుడిగా సిద్ధార్థ్ ఆనంద్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం షారుక్ పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం టైటిల్‌ను ప్రకటించి, ఓ అదిరిపోయే గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. ముందునుంచి ప్రచారంలో ఉన్న 'కింగ్' అనే టైటిల్‌నే అధికారికంగా నిర్ణయించారు. 'నేనెంత మందిని చంపానో గుర్తులేదు. వారు మంచివాళ్లా, చెడ్డవాళ్లా అన్నది నేనెప్పుడూ అడగలేదు. వారి కళ్లల్లో భయం మాత్రమే నాకు గుర్తుంది', 'వెయ్యికి పైగా హత్యలు చేసి, వందలాది దేశాల్లో మోస్ట్ వాంటెడ్ అయిన నాకు ఈ ప్రపంచం ఇచ్చిన పేరు.. కింగ్, 'నేను భయం కాదు.. విధ్వంసం' అనే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. రెడ్ చిల్లీస్ ఎంటర్టైన్‌మెంట్స్, మార్‌ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది. ఈ సినిమాలో సరికొత్త షారుక్‌ను చూస్తారని మేకర్స్ హామీ ఇచ్చారు.

హైదరాబాద్‌లో భారీ ఈవెంట్



మహేశ్‌బాబు-రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న 'ఎస్ఎస్ఎంబీ29' చిత్రబృందం నుంచి అప్డేట్ వచ్చింది. ఈనెల 15న హైదరాబాద్‌లో గ్లోబ్ ట్రోట్టర్ పేరుతో ఒక భారీ ఈవెంట్‌ను నిర్వహించనున్నారు. అందులో సినిమా టైటిల్, గ్లింప్స్ వీడియోను ఆవిష్కరించనున్నారు. దీనికి సంబంధించిన ప్రోమోను ఉమెన్స్ వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఓ ఓటీటీ సంస్థ ప్రత్యక్ష ప్రసారం చేయనున్నది. కాగా, సినిమా ప్రారంభమై రెండేళ్లు అవుతున్నా మేకర్స్ నుంచి అధికారికంగా ఒక్క అప్డేట్ కూడా రాలేదు. అయితే నవంబరులో అప్డేట్ ఇస్తామని గతంలో రాజమౌళి ఓ పోస్టు చేశారు. సినిమా టైటిల్‌తో పాటు మహేశ్‌బాబు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేస్తామని చెప్పడంతో అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే నవంబరు మొదలైనా ఎలాంటి అప్డేట్ రాలేదు. ఈ నేపథ్యంలో మహేశ్‌బాబు 'నవంబరులో మీరు మాకు ఒక హామీ ఇచ్చారు. దయచేసి ఆ మాట నిలబెట్టుకోండి' అని ట్వీట్ చేశారు. దీంతో జక్కన్న కూడా 'సరే మహేశ్.. నవంబరు మొదలైంది ఇప్పుడే కదా.. మేము తప్పకుండా ఒక్కొక్కటిగా వెల్లడిస్తాం' అని సమాధానం ఇచ్చారు.

పెళ్లి తర్వాత ప్రేమంటే?



ప్రియదర్శి, ఆనంది జంటగా నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'ప్రేమంటే'. సుమ కనకాల కీలకపాత్ర పోషిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బేనర్‌పై పుస్కూర్ రామ్ మోహన్‌రావు, జాన్వీ నారంగ్ నిర్మిస్తున్నారు. నవనీత్ శ్రీరామ్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. స్పిరిట్ మీడియా పతాకంపై రానా దగ్గుబాటి సమర్పిస్తున్నారు. నవంబర్ 21న ఈ చిత్రం విడుదలవుతోంది. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం ట్రైలర్‌ను విడుదల చేసింది. టైటిల్‌కు తగ్గట్లుగానే ప్రేమలో ఉన్నప్పుడు పెళ్లి తర్వాత జీవితం గురించి కనే కలలు, వాస్తవ జీవితంలోని చిన్న చిన్న సమస్యలతో ఎలా మారుతుందో చూపిస్తూ ఆద్యంతం వినోదంగా సాగిన టీజర్ ఆకట్టుకుంది. ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్, సినిమాటోగ్రఫీ: విశ్వనాథ్‌రెడ్డి.

మనం గర్వపడే సినిమా

రామ్ పోతినేని



రామ్ పోతినేని కథానాయకుడిగా పి.మహేశ్‌బాబు తెరకెక్కిస్తున్న చిత్రం 'ఆంధ్రా కింగ్ తాలూకా'. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాను మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ప్రచార చిత్రాలు, టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ విషయాన్ని ఆదివారం మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ 'ఆంధ్రా కింగ్ తాలూకా' నేను గర్వపడే సినిమా. మనమందరం గర్వపడే సినిమా. నా కెరీర్‌లో ఇంత అందమైన సినిమా ఇచ్చిన మహేశ్‌కు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. కన్నడ నటుడు ఉపేంద్ర ఇందులో సూపర్‌స్టార్ పాత్రలో కనిపించనున్నారు. ఈనెల 28న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సిద్ధార్థ నుని, సంగీతం: వివేక్, మెర్విన్.

గెలుపు పాటతో మొదలు



కన్నడ హీరోలు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి నటిస్తున్న మల్టీస్టారర్ '45 ది మూవీ'. అర్జున్ జన్య దర్శకత్వంలో ఉమా రమేశ్‌రెడ్డి, ఎం. రమేశ్‌రెడ్డి నిర్మిస్తున్నారు. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. 'గెలుపు తలుపు దొరికేవరకూ దిగులు పడకురా' అంటూ సాగే గీతాన్ని యూనిట్ ఆదివారం విడుదల చేసింది. దర్శకుడు అర్జున్ జన్య ఈ గీతాన్ని స్వరపరిచారు. రోల్ రైడా, వినాయక్ ఆలపించారు. సినిమాటోగ్రఫీ: సత్య హెగ్డే.

వసుదేవ సుతం



మాస్టర్ మహేందర్ ప్రధాన పాత్రలో వైకుంఠ్ బోను తెరకెకిస్తున్న చిత్రం 'వసుదేవ సుతం'. ధన లక్ష్మి బాదర్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'వసుదేవ సుతం' అంటూ సాగే గీతాన్ని హీరో ఆకాశ్ జగన్నాథ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'పల్లెటూరి వాతావరణంలో అందర్నీ కట్టిపడేసేలా చిత్రీకరించిన ఈ పాట నాకు బాగా నచ్చింది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుందనే నమ్మకం ఉంది. చిత్రం ఘనవిజయం సాధించాలి' అని కోరుకున్నారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ గీతానికి మణిశర్మ సంగీతం అందించారు.

చాందినీ చిత్రం షురూ



చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న కొత్త చిత్రం ఆదివారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు తరుణ్ భాస్కర్ క్లాప్ ఇచ్చారు. ఈ చిత్రానికి వికాస్ దర్శకుడు. సహచారి ప్రొడక్షన్ పతాకంపై సృజన్ గోపాల్ నిర్మిస్తున్నారు. సుశాంత్ యాష్కీ కీలకపాత్ర పోషిస్తున్నారు. ఈ సందర్భంగా సృజన్ గోపాల్ మాట్లాడుతూ 'సైన్స్ ఫిక్షన్ డార్క్ కామెడీ జానర్లో ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ఎవరూ ఊహించని ఒక సూపర్ హీరోను పరిచయం చేస్తున్నాం' అని చెప్పారు. వికాస్ మాట్లాడుతూ 'అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ చిత్రం కథ సాగుతుంది. కాన్సెప్ట్ వీడియోను త్వరలో విడుదల చేస్తాం' అని చెప్పారు.

రైతుల వెతలే కథగా...



పులివెందుల మహేశ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి షన్ను కథానాయిక. గంగా భవాని నిర్మించారు. హీరో సుమన్, ఆమని, మురళీధర్ గౌడ్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న సినిమా విడుదల కానుంది. ఇటీవలె నిర్వహించిన వేడుకలో చిత్ర దర్శకుడి తల్లిదండ్రులు ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో హీరో సుమన్ మాట్లాడుతూ 'ఒక రైతు పాత్రలో రైతులకు అండగా నిలబడేలా నా క్యారెక్టర్ ఉండబోతుంది' అని తెలిపారు.



చాంపియన్ ట్రోఫీ అందుకున్న విజయనగరం జిల్లా జట్టు

తైక్వాండో చాంపియన్ విజయనగరం జిల్లా

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శనివారపు పేట జడ్పీ హైస్కూల్ మైదానంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో విజయనగరం జిల్లా జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించింది. అండర్-14, 17 బాల బాలికలకు పోటీలు ఆదివారం జరిగాయి. డీవైఈవో పి.రవీంద్రభారతి మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యలను ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అలివేలు మంగ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రవిప్రకాష్, ఎస్టీఎఫ్ మండల కార్యదర్శి పి.పద్మలత, పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.



పోటీకి సిద్ధమవుతున్న స్విమ్మర్లు

ఉత్సాహంగా జిల్లా స్థాయి ఈత పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి ఎంపిక ఈత పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీల్లో 70 మంది బాల బాలికలు పాల్గొన్నారు. ఐదు విభాగాల్లో గ్రూపు 1 నుంచి గ్రూప్ 3 వరకు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి ఐ.మల్లికార్జున్ తెలిపారు. ఎంపికైన స్విమ్మర్లు ఈనెల 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే జూనియర్, సబ్ జూనియర్ విభాగంలో అంతర జిల్లా ఈత పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. పోటీలను స్విమ్మింగ్ కోచ్ రాజేంద్ర పర్యవేక్షించారు.



సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

సాఫ్ట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీ

కామవరపుకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం బాలుర సీనియర్ జిల్లా జట్టు ఎంపిక పోటీ జరిగింది. 33 మంది క్రీడాకారులు పాల్గొనగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్టు కార్యదర్శి మళ్ల ప్రతిమాదేవి, అధ్యక్షుడు మిడతా రమేష్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే సీనియర్స్ బాలుర రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆడమిల్లి, బుట్టాయగూడెం పీడీలు మానుకొండ సుబ్బారావు, తెల్లం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సొసైటీ చైర్మన్ తాతాజీ, సభ్యుల ప్రమాణస్వీకారంలో మంత్రి నిమ్మల

రైతులకు సొసైటీలు అండగా ఉండాలి

మంత్రి నిమ్మల రామానాయుడు

నరసాపురం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాలు రైతులకు అండగా ఉండాలని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. సీతారాంపురం సొసైటీ పాలకవర్గ ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైసీపీ పాలనలో సొసైటీలు నిర్వీర్యం అయ్యాయన్నారు. రైతులు అమ్మిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించలేకపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ సొసైటీలు ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ప్రభుత్వ మైనార్టీ సలహాదారు షరీఫ్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి, మత్స్యకార అభివృద్ధి సంస్థ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్న మాట్లాడారు. చైర్మన్ తాతాజీ, సభ్యులు శ్రీరామచంద్రుడు, మావుళ్లు ప్రమాణస్వీకారం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు బండారు మాధవనాయుడు, జానకీరామ్, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్‌రావు, ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, ఆర్డీవో దాసిరాజు, నెక్కంటి సుబ్బారావు, మైలా వసంతరావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడొద్దు

లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి



సదస్సులో మాట్లాడుతున్న గ్రేస్‌కుమారి

భీమడోలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు అపరిచిత ఫోన్‌కాల్‌కు స్పందించవద్దని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజా ప్రయోజనాల సేవల శాశ్వత లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ మేరీ గ్రేస్ కుమారి సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవంలో భాగంగా పోలసానపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఆదివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ ప్రస్తుతం సైబర్ నేరాలు అధికంగా ఉన్నాయని బాలికలు సెల్‌ఫోన్ ఉపయోగించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచితులకు వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వరాదన్నారు. బాలల ఉన్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అందిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలలో లోపం ఉంటే లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలతో పాటుగా ఉచిత న్యాయ సహాయం అందించడానికి న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితులతో వెళ్లిన యువకుడు తిరిగి రాలేదు!

ఏలూరు క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : స్నేహితులతో బయటకు వెళ్లిన ఒక యువకుడు తిరిగి రాలేదని తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు తంగెళ్లమూడి గవర్నర్‌పేటకు చెందిన వీరన్న రంజిత్ కుమార్ (18) పదో తరగతి వరకూ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. అతని స్నేహితులతో గత నెల 28వ తేదీ రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో అతని తల్లి రామలక్ష్మి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ద్వారకాతిరుమలలో చిన వెంకన్న జల విహారం



కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం



ఆచంటలో సత్యనారాయణస్వామి, మదనగోపాలస్వామి తెప్పోత్సవం

శ్రీహరి జల విహారం

ద్వారకాతిరుమల, ఆచంట, కాళ్లకూరులో వైభవంగా తెప్పోత్సవం

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సుదర్శన పుష్కరిణిలో హంస వాహనంపై చిన వెంకన్న ఉభయనాంచారులతో ఆదివారం రాత్రి జల విహారం చేశారు. క్షీరాబ్ది ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన తెప్పోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. విద్యుద్దీపకాంతులు, కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ, బాణసంచా మోత, అర్చకుల వేదఘోషల నడుమ జరిగిన ఉత్సవం కనువిందు చేసింది. ముందుగా ఆలయంలో తొళక్కవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, సన్నాయి డోలు వాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం వాహనాన్ని సుదర్శన పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. పుష్కరిణిలో హంసవాహనంగా అలంకరించిన తెప్పలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీ ఎస్‌వి నివృతరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ నడుమ తెప్ప పుష్కరిణిలో విహరించింది. పుష్కరిణి మధ్యనున్న మండపంలో శ్రీవారు. పద్మావతి, ఆండాళ్ అమ్మవార్ల నుంచి అర్చకులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవ వైభవాన్ని వీక్షించారు.

ఆచంటలో వైభవంగా తెప్పోత్సవం

ఆచంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా ఆచంటేశ్వరుని ఆలయం ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పూజలు, అభిషేకాలతో కిటకిటలాడింది. సాయంత్రం రామ గుండం చెరువులో ఆచంటేశ్వరుని సన్నిధిలోని సత్యనారాయణస్వామి, మదన గోపాలస్వామి వార్ల జల విహారం కన్నుల పండువగా జరిగింది. స్వామి వార్ల గ్రామోత్సవం అనంతరం రామగుండం చెరువు వద్ద పూజలు నిర్వహించి అలంకరించిన రెండు పడవల్లో బాణసంచా కాల్పుల నడుమ స్వామి వార్ల తెప్పోత్సవం నిర్వహించారు. ఆచంట, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ చైర్మన్ నెక్కంటి గణేశ్వరరావు, ఈవో ఆదిమూలం వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆచంట ఎస్‌ఐ కట్టా వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

కాళ్లకూరులో క్షీరాబ్ది ద్వాదశి పూజలు

కాళ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం క్షీరాబ్ది (చిలుకు) ద్వాదశి సందర్భంగా ఆదివారం రాత్రి కన్నుల పండువగా శ్రీవారికి తెప్పోత్సవం నిర్వహించారు. మేళతాళాలతో తొలుత స్వామి, అమ్మవార్లను శేష వాహనంపై పురవీధుల మీదుగా పద్మావతి పుష్కరిణి వద్దకు తీసుకువచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన హంస వాహనంపై పూజలు నిర్వహించారు. బాణసంచా వెలుగులు, వేదమంత్రాల నడుమ గోవింద నామస్మరణతో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ తనయుడు భరత్, పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తెప్పోత్సవం సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను దేవస్థానం ఈవో ఎం.అరుణకుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.



శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో వెళుతున్న భక్తులు



గుబ్బల మంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు



మద్ది ఆలయంలో సువర్చలా హనుమద్ కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరుడు



క్షీరా రామలింగేశ్వరుడికి ప్రత్యేక అలంకరణ

కిటకిటలాడిన చిన్న తిరుపతి

గోవిందా.. గోవిందా..

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్న వెంకన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం, సెలవు రోజు కావడంతో ఉదయం నుంచి ఆలయానికి యాత్రికుల రద్దీ నెలకొంది. దేవస్థానంలోని అన్ని విభాగాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపై పార్కింగ్ ప్రాంతం కార్లు, ద్విచక్ర వాహనాలతో నిండింది. శ్రీవారి ఉచిత దర్శనానికి 2గంటల పైబడి సమయం పట్టింది. సుమారు 12 వేల మంది వచ్చినట్లు అధికారుల అంచనా. సాయంత్రం నుంచి రద్దీ తగ్గుముఖం పట్టింది. శ్రీవారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 125 జంటలు పాల్గొన్నారు.

మద్దిలో సువర్చల హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం హనుమద్ హోమం అనంతరం సువర్చల హనుమద్ కల్యాణం వైభవంగా నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆలయ 108 ప్రదక్షిణలు, తలనీలాలు, అన్నప్రాసనలతో మొక్కులు తీర్చుకున్నారు. ఆలయానికి వివిధ సేవల రూపంలో రూ.2.42 లక్షల ఆదాయం వచ్చిందని, నిత్యాన్నదాన సత్రంలో సుమారు 3600 మంది అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్టు ఈవో ఆర్‌వి చందన తెలిపారు.

గుబ్బల మంగమ్మను దర్శించుకున్న భక్తులు

బుట్టాయగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో కొలువైన గుబ్బల మంగమ్మను ఆదివారం భక్తులు దర్శించుకున్నారు. తుఫాను కారణంగా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పోలీసు హెచ్చరికలతో నాలుగు రోజులపాటు ఆలయ మార్గం మూసివేశారు. వాతావరణం అనుకూలించడంతో మార్గం తెరవడంతో ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా కమిటీవారు ఏర్పాట్లు చేశారు.

క్షీరారామంలో చిలుకు ద్వాదశి పూజలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక శుద్ధ ద్వాదశిని చిలుకు ద్వాదశి, క్షీరాబ్ది ద్వాదశి అంటారు. పంచారామ క్షేత్రమైన క్షీరా రామలింగేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పంచారామ క్షేత్రాల దర్శనం పేరుతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఆర్టీసీ, వివిధ వాహనాల్లో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ క్షేత్ర పాలకుడు శ్రీలక్ష్మీ జనార్దనస్వామికి ప్రత్యేక పూజలు చేసి అలకంరణలు చేశారు. సుమారు 12వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్టు అంచనా.

ఆచంటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ఆచంటేశ్వరుడికి లక్షపత్రి పూజ

ఆచంట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆచంటేశ్వరుడికి ఆదివారం లక్షపత్రి పూజ పార్వతి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

సోమేశ్వరుడికి ప్రత్యేక అలంకారం

భీమవరం టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గునుపూడి సోమేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు రామకృష్ణ అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో డి.రామకృష్ణంరాజు, చైర్మన్ చింతలపాటి బంగార్రాజు పర్యవేక్షించారు.



ద్వారకాతిరుమలలో చోరీ జరిగిన ఇంట్లో ఎస్సై సుధీర్ పరిశీలన

వరుస చోరీలు

ద్వారకాతిరుమలలో ఒకే రోజు మూడు ఇళ్లలో దొంగతనాలు

12 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షల నగదు, ఒక బైక్ అపహరణ



పేరుపాలెం ఆలయం వద్ద డాగ్ స్క్వాడ్ తనిఖీ

ద్వారకాతిరుమల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరుస దొంగతనాలతో ద్వారకాతిరుమల ప్రజలు హడలెత్తిపోయారు. మూడు ఇళ్లలో ఒకేరోజు దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. శనివారం అర్ధరాత్రి వేళ దొంగలు రెచ్చిపోయారు. దాదాపు 12 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2.50 లక్షలు నగదు అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తులు గ్రామానికి చెందిన పోలుబోయిన లక్ష్మణరావు ఇంట్లో ప్రవేశించి మత్తు మందు చల్లారు. బీరువా పగలుకొట్టి దర్జాగా బంగారు నగలు దోచుకెళ్లారు. దాదాపు పది కాసుల బంగారు నగలు పోయినట్లు ఉదయం గుర్తించిన బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించారు. చెరువు వీధిలో ఉంటున్న కనిగొళ్ల లక్ష్మికాశి విశ్వనాథం ఇంట్లో ఎవరూ లేనిసమయంలో చొరబడి రెండు కాసుల బంగారం, రూ.2.50 లక్షలు నగదు దోచుకెళ్లారు. కాశి అశ్వారావుపేటలోని తన సోదరి ఇంటికి శుభకార్యం నిమిత్తం కుటుంబ సమేతంగా వెళ్లారు. తిరిగి ఆదివారం సాయంత్రం వచ్చేసరికి ఇంటి తలుపులు తెరచి ఉండడంతో దొంగతనం జరిగిందని గుర్తించి లబోదిబోమన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గ్రంథాలయం పక్కరోడ్డులోని పీఎంపీ వైద్యుడు నరం నరసింహరావు ఇంటి ఆవరణలో ఉంచిన పల్సర్ బైక్ అపహరించారు. చోరీ సంఘటన సీసీ కెమెరాలో రికార్డు అయింది. వీటిపై బాధితులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఘటనా స్థలాలను పరిశీలించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వినాయకుడి ఆలయంలో చోరీ

మొగల్తూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం నాలుగు రోడ్ల ప్రధాన కూడలిలో వినాయకుడి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ ప్రధాన ద్వారం గేటును గునపాలతో బద్దలుకొట్టి గుడి లోపల హుండీ దొంగిలించుకుపోయారు. పేరుపాలెం పంచాయతీ సమీపంలోని బరియల్ గ్రౌండ్ వద్ద దొంగిలించిన హుండీని గునపాలతో పొడిచి అందులో నగదు దొంగలు అపహరించినట్లు గ్రామస్థులు తెలిపారు. సమాచారం అందుకున్న మొగల్తూరు పోలీస్‌లు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లకు సమాచారం అందించడంతో ఆ రెండు బృందాలు తనఖీలు చేశాయి. అయితే వినాయకుడు ఆలయ కమిటీ నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వలేదని, ఫిర్యాదు ఇచ్చిన అనంతరం కేసు నమోదు చేస్తామని మొగల్తూరు పోలీసులు తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా దొరికింది



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగారం తక్కువ ధరకు ఇస్తున్నామని నమ్మించి, తర్వాత వారిని బెదిరించి డబ్బులు దోచుకుపోయే నలుగురు అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను తాడేపల్లిగూడెం పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టణ ఎస్సై ఆదిప్రసాద్ ఆదివారం వివరాలు తెలిపారు. జల్సాలకు అలవాటు పడిన కర్నాటకకు చెందిన ఐదుగురు వ్యక్తులు లాడ్జీల్లో రిజిస్టర్లు పట్టుకుపోయి అందులో నంబర్లకు ఫోన్‌చేసి తక్కువ ధరకు బంగారం ఇస్తామని చెబుతున్నారు. త్వరగా డబ్బులతో వస్తే బంగారం దక్కుతుందని తొందరపెట్టి నిర్మానుష ప్రాంతాలకు తీసుకెళ్తున్నారు. అక్కడ నకిలీ బంగారం చూపుతున్నారు. బంగారం కోసం వచ్చిన వారు అసలు, నకిలీ చూడాలని అడిగితే కత్తితో బెదిరించి పరారవుతున్నారు. ఫిర్యాదులు అందడంతో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో డీఎస్పీ విశ్వనాథ్ సూచనలతో సీఐ ఆది ప్రసాద్, ఎస్సై నాగరాజు దర్యాప్తు చేపట్టారు. కర్ణాటక చిత్రదుర్గం మండలం కునటేపు గొల్లరబట్టికి చెందిన శరణప్ప గంగప్ప, సండూర్ మండలం త్రిపురకు చెందిన కార్తీక్ ఉమాపతి,ఎన్ శశికుమార్, రుద్రప్ప, గజపుర మండలానికి చెందిన బత్తినపల్లికి చెందిన సతవాడ సందీప్‌లుగా గుర్తించారు. జాతీయ రహదారిపై కారులో వెళ్తున్న ఐదుగురిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.13,500 నగదు, చాకు, కియా కారు, లాడ్జ్ పుస్తకాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు వేగంగా దర్యాప్తు చేసిన డీఎస్పీ విశ్వనాథ్, సీఐ ఆది ప్రసాద్, ఎస్సైలు నాగరాజు, బాదం శ్రీనును ఎస్పీ అభినందించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వరకట్నం కోసం వేధించిన భర్తపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. నూకాలమ్మ గుడి ప్రాంతానికి చెందిన మారుమూడి రవికి నెదురు మల్లికతో వివాహమైంది. రవి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పనిచేస్తున్నాడు. భార్య మల్లికను వరకట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధించడంతో ఆమె ఫిర్యాదు మేరకు సీఐ కె.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భగ్గుమన్న కూరగాయల ధర

అన్నీ కిలో రూ.60 పైనే

వంకాయలు కిలో రూ.120

తాడేపల్లిగూడె, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. అన్ని కూరగాయల ధరలు కిలో రూ.60 పైనే ఉన్నాయి. వంకాయల ధర మరింత మండుతోంది. మొంథా తుఫాన్ ప్రభావంతో లంకప్రాంతాల్లో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీనికితోడు కార్తీక మాసం కారణంగా కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. ప్రధానంగా గోదావరి పరివాహక ప్రాంతాలైన ఖండవల్లి, ఆచంట, సిద్ధాంతం, రావులపాలెం, గోపాలపురం ప్రాంతాల్లో కూరగాయలు పండించడంతో పాటు ఇతర తోటలో అంతరపంటగా సాగు చేస్తుంటారు. మెట్ట ప్రాంతాల్లో కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల, చింతలపూడి, లింగపాలెం మండలాల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో మండలం జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం, లింగారాయుడుగూడెంలో కూడా సాగు పెంచారు. ఇటీవల కురిసిన వర్షాలకు గాలులకు కూరగాయలు తోట పూర్తిగా ధ్వంసమైనాయి. ఉన్న తోటలకు చీడపీడలు ఆశించడంతో దిగుబడి తగ్గింది. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచేస్తున్నారు. వంకాయ ధర కిలో రూ.120 చేరిందంటే పరిస్థితి అర్థమవుతోంది. బీరకాయలు రూ.80, చిక్కుడు రూ.120, క్యారెట్ రూ.70, బీట్‌రూట్ రూ.90, కాకరకాయ రూ.60, ఆకాకరకాయ రూ.140, చిలకడ దుంపలు రూ.80, క్యాప్సికం రూ.120, దోసకాయ రూ.60, బెండకాయలు రూ.80, దొండకాయలు రూ.60, కంద రూ.70, అల్లం మంచి రకం రూ.100 నుంచి 120 మధ్య అమ్మారు. అరటికాయలు జత రూ.20, మునగకాడ జత రూ.30 వంతున విక్రయిసున్నారు.

మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్



మార్కెట్లో మహారాష్ట్ర ఉల్లికి డిమాండ్ తగ్గలేదు. ఆదివారం మార్కెట్‌కు మహారాష్ట్ర నుంచి 10 లారీల్లో 290 టన్నుల ఉల్లి వచ్చింది. హోల్‌సేల్‌గా క్వింటా రూ.1800 నుంచి 2300 ధరకు విక్రయించారు. కర్నూలు నుంచి 4 లారీల్లో 60టన్నుల ఉల్లి వచ్చింది. క్వింటా రూ.1000 నుంచి 1300 మధ్య విక్రయించారు. ఇక రిటైల్‌గా నాసిరకం ఉల్లి రూ.100కు 6కిల వంతున అమ్మకాలు జరిగాయి. మంచి రకం ఉల్లి 4 కిలోలు రూ.100, మధ్య రకం ఉల్లి 5 కిలోలు రూ.100 చొప్పున విక్రయించారు.

కమ్యూనిస్టు సిద్ధాంతమే మానవాళి విముక్తికి మార్గం : ఐఎఫ్‌టీయూ

ఏలూరు రూరల్, నవంబరు 2, (ఆంధ్రజ్యోతి) : కార్ల్‌మార్క్స్ ఏంగెల్స్ 1848లో రచించిన "కమ్యూనిస్టు ప్రణాళిక" వెలుగులో ప్రజలు పోరాడినప్పుడే ప్రజలకు విముక్తి లభిస్తుందని ఐ.ఎఫ్.టి.యు రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్ అన్నారు. స్థానిక మర్చంట్ ఛాంబర్ కల్యాణ మండపంలో జరుగుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర రాజకీయ తరగతుల్లో భాగంగా రెండవ రోజు మార్క్సిజం - సులభ పరిచయం అనే అంశాన్ని ఆయన వివరించారు. సమాజ పరిణామ క్రమంలో అనివార్యంగా ప్రజలు కమ్యూనిస్టు సమాజం వైపు ప్రయాణం సాగిస్తారని స్పష్టం చేశారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



పెదవేగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంట శ్రీరాట్నాలమ్మ వారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపారు. అమ్మవారికి పాల పొంగలిని నైవేద్యంగా సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పావులూరి వీరవెంకట రామసత్యనారా యణ శర్మ, రుద్రపాక మోహన దుర్గా శేషగిరిరావు, పావులూరి పూర్ణయ్యశర్మ, చావలి సాయి పూజలు నిర్వహించారు.

అఖిల భారత మహాసభలు జయప్రదం చేయండి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభలు డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4వ తేదీ వరకు విశాఖలో జరుగుతున్నాయని సీఐటీయూ నాయకులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, వై.ఎస్.కనకారావు, పంపన రవికుమార్, వి.వి.ఎన్.ప్రసాద్, జి.కోటేశ్వరరావులు తెలిపారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మహాసభలు జరిగే నేపథ్యంలో ఈనెల 6న స్థానిక సీతారామభర్తియా మర్చంట్స్ కల్యాణ మండపంలో రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఈ సదస్సుకు సీఐటీయూ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బి.వి.రాఘవులు ముఖ్య వక్తగా హాజరవుతారన్నారు.సీఐటీయూ అనుబంధ ఉద్యోగ కార్మిక వర్గం ఈ సదస్సుకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

శ్వేతపత్రానికి కేఆర్‌పీఎస్ డిమాండ్

ఏలూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల జనాభా శాతం, ప్రభుత్వ, ప్రైవేటు, అసంఘటితరంగాల ఉద్యోగాల్లో ఆ కులాలవారి సంఖ్య, పేదలు, మధ్య తరగతి, సంపన్నవర్గాల్లో వారిశాతం, వార్డు మెంబర్ నుంచి నామినేటెడ్ పోస్టుల వరకు ఎంతమంది ఉన్నారనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేఆర్‌పీఎస్(కాపు రిజర్వేషన్ పోరాట సమితి)రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ రావి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దశాబ్దాలకాలంగా కాపులకు సమధర్మం, సమన్యాయం జరగడంలేదని, పాలకపక్షాలు కులవివక్షను, సవతితల్లి ప్రేమను చూపిస్తున్నాయని ఆరోపించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

లింగపాలెం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి రక్షణ పొందాలని క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరాలని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న అన్నారు. మండలంలోని ధర్మాజీగూడెంలో ఆదివారం ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ ప్రతి ఏటా ఎక్కువ మంది వాహనదారులు రోడ్డు ప్రమాదాల సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని కారణంగానే మరణిస్తున్నారన్నారు.

అఖిల భారత ఓబీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పోసిబాబు

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్ ఆధ్వర్యంలో గుంటూరులో సమావేశం జరిగింది. ఈసందర్భంగా అఖిల భారత ఓబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాటపర్తి పోసిబాబుకు నియామక పత్రాన్ని అందజేశారు. చాటపర్తి పోసిబాబు మాట్లాడతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల గణనకు నిర్ణయం తీసుకోవడం పట్ల హర్షం ప్రకటించారు. ప్రభుత్వం బీసీల సమగ్ర అభివృద్ధి సాధికార కొరకు ప్రత్యేక బీసీ అసెంబ్లీ సమావేశాన్ని నిర్వహించాలని బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు, బీసీ సామాజిక రక్షణ చట్టం అమలు చేసేందుకు అసెంబ్లీలో బీసీ బిల్లులను ప్రవేశపెట్టాలన్నారు.

ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా బాబూరావు

ఏలూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావును ఆదివారం విశాఖపట్నంలో జరిగిన సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వై.దేముడు తెలిపారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న ఆయన సంఘ నాయకత్వ బాధ్యతలు చేపట్టడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. రాజ్యసభ సభ్యుడు బాబూరావుకు సంఘ నాయకులు బ్రహ్మారెడ్డి, కృపాదానం, గౌరీశంకర్, తదితరులు అభినందనలు తెలిపారు.

వైభవంగా ముస్లింల గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ముస్లింలు గ్యార్మీ షరీఫ్ ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ ఖాజీ షేక్ హుస్సేన్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. సూఫీ ఆధ్యాత్మిక గురువు హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ జిలానీని స్మరించే పవిత్ర ఉత్సవం గ్యార్వీ షరీఫ్ పండుగని అన్నారు. ఏలూరు అహేలే సున్నత్ వల్ జమాత్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక గన్ బజార్‌లోని పెన్షన్ మహల్లా హజరత్ సుభాని మహాత్ముల వారి జెండా చెట్టు వద్ద గ్యార్మీ షరీఫ్ పండుగ ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. గౌవర అధ్యక్షులు ఎస్ఎం అక్బర్, ముస్లిం మైనార్టీ నాయకులు అబ్దుల్ రషీద్, జమాత్ అధ్యక్షుడు సాబీర్ హుస్సేన్, ఎండీ కాలేషా, అంజుమన్ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, రాజా అహ్మద్, ఎండీ ఖాసిమా, ఎస్.కె. అహ్మద్‌ఖాజా, షేక్ మస్తాన్, ఎండి మహబూబ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

ఏలూరు క్రైం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కట్నం కోసం భార్యను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్న భర్తతో పాటు అతని కుటుంబ సభ్యులపై ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు బావిశెట్టివారిపేటనకు చెందిన బేబీ రమ్యశ్రీతో 2021 ఆగస్టు 26న గుంటూరు జిల్లా అరండల్ పేటనకు చెందిన ఇమ్మంది రామ్ లోకేష్‌తో వివాహమైంది. వివాహ సమయంలో రూ.22 లక్షల నగదు, 25 కాసుల బంగారం, కేజీన్నర వెండి సామగ్రి, సారె నిమిత్తం రెండు లక్షల రూపాయలిచ్చి కాపురానికి పంపించారు. కొన్నాళ్లు కాపురం సజావుగానే సాగింది. మోటార్ సైకిల్ కూడా కొనిచ్చారు. 2022 ఆగస్టులో బేబీ రమ్యశ్రీ పాపకు జన్మనిచ్చింది. ఆడ బిడ్డ పుట్టిందని పొలం రాయించుకురావాలని వేధించడంతో 50 సెంట్ల పొలాన్ని రాసిచ్చారు. రామ్‌లోకేష్, అతని కుటుంబ సభ్యులు కలిసి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధించి కొట్టడంతో ఈ ఏడాది అక్టోబర్ 6న తన పుట్టింటికి వచ్చేసింది. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రామ్‌లోకేష్, అతని కుటుంబ సభ్యులపై వన్‌టౌన్ ఎస్ఐ వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిగురించిన ఆశలు

(5పేజీ తరువాయి)

పరిహారం అందుతుందని, తమ కష్టాలు తీరుతాయని నిర్వాసిత కుటుంబాల్లో ఆనందం నెలకొంది. ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లో 45.72 కాంటూరు లెవెల్‌లో 201 గ్రామాలు ఉండగా సుమారు 58 వేలు కుటుంబాలున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్ణ యంతో వీరందరికీ న్యాయం జరగనుంది.

మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలి: వై.నాగేంద్రరావు, సీసీఎం



మండలాన్ని యూనిట్‌గా తీసుకుని గ్రామాలకు పరిహారం అందించాలి. అప్పుడే ప్రతి నిర్వాసితునికి న్యాయం జరుగుతుంది. అధికారులు వేగవంతంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తున్నట్టే పునరావాస ప్రక్రియ చేపట్టి నిర్వాసితులకు న్యాయం చేయాలి.

45.72 కాంటూర్ లెవెల్‌లో పరిహారం అందించాలి:కె. లక్ష్మయ్య, సీపీఐ



45.72 కాంటూర్ లెవెల్‌లో ముంపు గ్రామాలకు పరిహారం అందిస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. ఆ మేరకు అమలు చేస్తే అన్ని గ్రామాల నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది. గోదావరి వరదలకు ఏటా ముంపుకు గురవుతున్న నిర్వాసితుల బాధలు తీరుతాయి.

తీరని చింత!

(5వ పేజీ తరువాయి)

రావాల్సి ఉంది. జోన్-3 కింద ఉన్న 2.10 లక్షల ఎకరాల ఆయకట్టును చింతపూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలలతో స్థిరీకరించేలా డిజైన్ రూపొందించారు. ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే ఈ పథకాన్ని పూర్తి చేస్తానని ప్రస్తుత నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారని ఆ మేరకు హామీని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుప్రీం కోర్టులో, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతికి కృషి

- చిన్నబాబు, ఈఈ, చింతలపూడి ఎత్తిపోతల పథకం

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి కృషి జరుగుతోంది. వీలైనంత త్వరగా పనులు పునః ప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

కూటమి సర్కార్‌పై నమ్మకంతో ఉన్నాం



చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని నమ్మకంతో ఉన్నాం. వైసీపీ ప్రభుత్వం తీరు వల్ల తీవ్ర నష్టం జరిగింది. గోదావరి జలాలు మెట్ట భూముల్లోకి వస్తే పంటలు పండి ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది.

-ఎం. వెంకటేశ్వరరావు, ఆయకట్టు రైతు, పోలవరం, చాట్రాయి మండలం



కొబ్బరినీళ్లతో స్వామికి అభిషేకం



గుంజవరంలో స్వామి వారి కల్యాణం



కేదవరంలో అమ్మవారికి పూజ



పెదపాడులో శ్రీవారి కల్యాణోత్సవం

ఆలయాల్లో కార్తీక సందడి..

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక ద్వాదశి పర్వదినం సందర్భంగా ఆదివారం పవరుపేట స్టేషన్ రోడ్డులోని ధన్వంతరి వైద్య భగవానుని ఆలయం వద్ద భక్తులు స్వామికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సూర్యనారాయణస్వామికి కొబ్బరి బొండాల జలాలతో స్నానోత్సవం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని అర్చకులు రాళ్ళబండి ఆది నారాయణశర్మ ద్వారా రక్షాబంధనాలు కట్టించుకుని వనమూలికల తీర్థాన్ని స్వీకరించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. భజనలు నిర్వహించి భక్తి సంకీర్తనలు ఆలపించడంతో ఆలయం వద్ద సందడి నెలకొంది.

● పోలవరం: మండలంలో గుంజవరం గ్రామంలో ఉన్న ఉమా సహిత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక మాసం సందర్భంగా వనభోజనాలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి రుద్రాభిషేకాలు అర్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కల్యాణం నిర్వహించారు. అనంతరం కార్తీక మాస వన భోజనాలు నిర్వహించారు. సుమారు 4 వేల మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కేదవరంలో గౌరీదేవికి సారె..

దెందులూరు: మండలంలోని పోతునూరు పంచాయతీ శివారు కేదవరంలో గౌరీ శంకరుల ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఆదివారం పెద్ద ఎత్తున గౌరీ దేవికి సారె సమర్పించారు. మహిళలు, వివాహం కాని బాలికలు, బంధువులతో వారు నూతన వస్త్రాలు, ధరించి పుష్పాలు, పసుపు, కుంకుమ, పిండి వంటలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.అనంతరం గౌరీదేవి ఆలయానికి భక్తులు, మహిళలు చేరుకుని సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరీదేవి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి కల్యాణం

పెదపాడు: పెదపాడు గ్రామానికి చెందిన కాకరాల సత్యనారాయణ దంపతుల ఆధ్వర్యంలో పెదతిరుపతి అర్చక స్వాముల ఆధ్వర్యంలో పెదతిరుపతి శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పెదతిరుపతి తరహా ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు, అలంకరణలు చేసి శాస్త్రోక్తంగా మంగళ వాయిద్యాలు, హోమాలు నడుమ కల్యాణం వేడుకగా జరిగింది. కార్తీకమాసంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించడం, వీక్షించడం శుభప్రదమని అర్చకులు తెలిపారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అయ్యప్ప పూజకు హాజరైన స్వాములు, మహిళలు

అయ్యప్పకు ప్రత్యేక పూజలు..

పెదపాడు: పెదపాడులో అయ్యప్ప మాలధారణ చేసిన విజ్జి శేఖర్ ఇంటి వద్ద పూజ, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక వేదికపై పంచలోహ విఘ్నేశ్వర, కుమార, అయ్యప్ప స్వాముల విగ్రహాలను వుంచి తేనె, పన్నీరు, చెరకు రసం, పాలు, పెరుగు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అభిషేకం, పూజలనంతరం స్వామివార్లకు మహా అన్న నివేదన, స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహించారు.

శెట్టిబలిజల సంక్షేమానికి కృషి చేస్తా : మంత్రి సుభాష్



మంత్రిని సన్మానిస్తున్న సంఘ నాయకులు

జంగారెడ్డిగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజల సంక్షేమానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం పట్టణంలో శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, కక్కల ధర్మరాజులు పాల్గొని మంత్రి సుభాష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని కులాలను గౌరవిస్తూనే శెట్టిబలిజల ఆర్థిక, సామాజిక, రాజకీయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ నెల 16న అమలాపురంలో జరిగే శెట్టిబలిజల వన సమారాధనకు రాజకీయ పార్టీలకు అతీతంగా భారీ సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు లక్షల మంది శెట్టిబలిజలు హాజరవుతారని తెలిపారు. అనంతరం మంత్రి సుభాష్‌ను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న జాహ్నవి అనే చిన్నారికి మంత్రి సుభాష్ రూ.20 వేలు సాయం అందించారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, వనచర్ల లింగస్వామి, కేతా రాధాకృష్ణ, గుబ్బల వెంకటేశ్వరరావు, వీరవల్లి సోమేశ్వరరావు, సంఘ నాయకులు పాల్గొన్నారు.


బాబూరావు సంతాప సభ

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సీపీఎం పూర్వ జిల్లా కార్యదర్శి చింతకాయల బాబూరావు అకాల మరణం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గానికి తీరని లోటని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్ అన్నారు. ఆదివారం సీపీఎం కార్యాలయంలో బాబూరావు సంతాప సభ నిర్వహించారు. కార్మిక వర్గానికి బాబూరావు చేసిన సేవలను పలువురు కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు పిల్లి రామకృష్ణ, గొట్టాపు రవికిషోర్, కనకారావు, ప్రసాద్, ఏసుబాబు, లెనిన్, సత్యనారాయణ, వెంకట్రావు పాల్గొన్నారు.



ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

బుట్టాయగూడెం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం విద్యా రోహిణి డిజిటల్ స్కూల్లో ఆదివారం జంగారెడ్డిగూడెం ఏజెన్సీ లయన్స్ క్లబ్, బీజేపీ-విద్యా రోహిణి డిజిటల్ స్కూల్ ఆధ్వర్యంలో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ వారు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించగా 230 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 150మహిళలు ఉన్నారు. శిబిరాన్ని బీజేపీ జిల్లా ఎస్టీ మోర్చ అధ్యక్షురాలు వంకా కాంచనమాల ప్రారంభించగా లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ దాసరి శేషకుమార్, కొండపల్లి పండు, మద్దిపాటి నాగేశ్వరావు, కొండేపాటి రామకృష్ణ, బసవతారకం ఆసుపత్రి వైద్యాధికారి డాక్టరు రవిశంకర్, క్యాంపు ఆర్గనైజర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న దాత నారాయణస్వామి

వ్యాయామ కళాశాలకు రూ.లక్ష విరాళం

దెందులూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): తాను చదివిన వ్యాయామ కాలేజీ అభివృద్ధికి పూర్వ విద్యార్థి రూ.లక్ష విరాళం ఆదివారం అందించారు. దెందులూరు మండలం గోపన్నపాలెంలో ఉన్న శ్రీసీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలకు 1981 సంవత్సరంలో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థి పి.ఆర్.నారాయణస్వామి రూ.లక్ష రూపాయలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియేల్‌కు అందజేశారు. నారాయణ స్వామి ఆంధ్రా యూనివర్సిటీకి డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు.

ఆయుష్ ఉచిత వైద్య శిబిరం

ఏలూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపం సమీపంలోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఏలూరు ఆయుష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణుడు డాక్టర్ కోయ హరికృష్ణ, ఇతర వైద్యులు పాల్గొని పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఆయుష్ హాస్పిటల్ మేనేజర్ కాశీనాథ్ జాస్తి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేస్తున్నామన్నారు.



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

దాతల సహకారం అవసరం

ఏలూరు టూటౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించేందుకు దాతలు సహకారం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు.ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం పేద విద్యార్థులకు కళాశాలల ఫీజులు అందించారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దివ్వెల జయబాబు, మరికొందరు దాతల సహకారంతో విద్యార్థులు మౌనిక, ఎస్.ప్రనీత్, ఏ.సాయి గణేశ్‌లకు కళాశాలల ఫీజులు చెల్లించారు. అనంతరం చంటి మాట్లాడుతూ కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమం ఒక యజ్ఞంలా కొనసాగుతోందన్నారు. కిషోర్, ఎ.తిరుపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటుకు దీటుగా పాఠశాలలను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని మండల విద్యాశాఖ అధికారి-2 అరుణ్ కుమార్ అన్నారు. శ్రీరామ్‌నగర్ ప్రత్యేక మండల పరిషత్ పాఠశాల లోగో విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా శారీరకంగా,మానసికంగా పటిష్టంగా ఉంచడానికి క్రీడలు అవసరమన్నారు. లోగో రూపొందించిన ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేంద్రసింగ్‌ను, పాఠశాల ఉపాధ్యాయుని నన్నేటి అనితను అభినందించారు.



వీడియోకాల్‌లో మాట్లాడుతున్న తపన చౌదరి

ఘనంగా తపన చౌదరి పుట్టిన రోజు వేడుక

ఏలూరు,నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరీ(తపన) పుట్టిన రోజు వేడుకలు జిల్లా వ్యాప్తంగా బీజేపీ నాయకులు కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఏలూరు జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు చౌటపల్లి విక్రమ్ కిషోర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వీడియా కాల్‌ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏలూరు కొత్తపేట నూకాలమ్మగుడిలో ప్రత్యేక పూజలు జరిపించారు.బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ కె.కృష్ణప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కురెళ్ల సుధాకర్ కృష్ణ, ఇందుకూరి అశోక్ చక్రవర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాది రాంబాబు, సీనియర్ నాయకులు నడవన దానభాస్కర్, సర్వేశ్వరరావులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..

ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్రంలో బీజేపీ 11 ఏళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను డిసెంబరు 25 వరకు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిషోర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన వర్క్‌షాప్ నిర్వహించి నాయకులకు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.



న్యాయమూర్తులతో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కిశోర్

న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్, ఎస్పీ

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని దర్శించిన సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జితేంద్రకుమార్ మహేశ్వరి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌లను పలువురు ప్రముఖులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. న్యాయమూర్తులను ఏలూరు రేంజ్ డీఐజీ జీవీవీ అశోక్ కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్, ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. అనంతరం న్యాయమూర్తులతో వారు కొంతసేపు ముచ్చటించారు.

టెట్‌కు దరఖాస్తు చేయొద్దు : ఫ్యాప్టో

ఏలూరు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)ను మినహాయింపును కోరుతూ ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేయడానికి సుముఖత వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.. ఈ పరిస్థితుల్లో టెట్‌కు ఉపాధ్యాయులు దరఖాస్తు చేయవద్దని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ తెలిపారు. టెట్ వద్దంటూ ఫ్యాప్టో చేస్తున్న ఉద్యమానికి జిల్లా ఉపాధ్యాయులంతా మద్దతునివ్వాలని కోరారు.



ఒకే వేదికపై 1983- 84 పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

పెదవేగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1983- 84 విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులు 40 ఏళ్ల తరువాత ఆదివారం ఉదయం తిరిగి అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా తిరిగి కలిసి రోజంతా ఉత్సాహంగా గడిపారు. ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా, రైతులుగా కొంతమంది కొప్పాకతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో నివాసం ఉండగా మరికొందరు హైదరాబాద్, విశాఖపట్నం, ఖమ్మం తదితర ప్రాంతాల్లో స్థిరపడ్డారు.



గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు

తాటికుంటలో గిరిజనుల మధ్య భూ సమస్య

జీలుగుమిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం నిర్వాసిత గ్రామం పి.నారాయణపురం రెవెన్యూ భూముల పరిధిలో గిరిజనుల మధ్య భూ వివాదం చోటు చేసుకుంది. పి.నారాయణపురం రెవెన్యూలో తూటికుంట గ్రామానికి చెందిన తామా బుచ్చిరాజు, లింగరాజు, బాలరాజులకు సుమారు 12 ఎకరాలు భూమిని నిర్వాసిత కుటుంబానికి 2011లో ప్రభుత్వం కేటాయించి పట్టాలిచ్చింది. తమకు చెందిన భూమిలో బుచ్చిరాజు భార్య లక్ష్మీ, కుమార్తె నాగమణి ఆదివారం దుక్కి పనులు చేపట్టగా కొందరు గిరిజనులు అడ్డుకున్నారు. దీంతో బాధితులు పోలీసులకు 112కు ఫిర్యాదు చేయగా హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వరావు వచ్చి పరిశీలించారు. రెవెన్యూ అధికారుల వద్ద భూ సమస్యను రికార్డుల ప్రకారం పరిష్కరించుకోవాలన్నారు. బుచ్చిరాజు భార్య లక్ష్మీ ఇప్పటికే జంగారెడ్డిగూడెం ఆర్డీవో, జీలుగుమిల్లి తహసీల్దార్, పోలీస్ అధికారులను ఆశ్రయించామని తమకు న్యాయం చెయ్యాలని అధికారులను కోరుతున్నారు.

5న ఉద్యాన పంటలపై అవగాహన

ఏలూరు రూరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 5న ఉదయం ఉద్యాన శాఖ వారిచే ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన నిర్వహిస్తున్నట్టు ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్ షాజా నాయక్ తెలిపారు. ఈ అవగాహన సదస్సులో వ్యవసాయ అనుబంధ రంగాలలో అనుభవం గల పారిశ్రామిక వేత్తలు, అభ్యుదయ పారిశ్రామిక వేత్తలు, రైతు ఉత్పత్తిదారుల ఫెడరేషన్స్/కంపెనీలు/సంఘాలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పబ్లిక్, ప్రైవేటు రంగ, భాగస్వామ్య సంస్థలు, ఎగుమతిదారులు, వ్యాపారులు, ప్రాసెసర్స్ ఉద్యాన పంటల అభివృద్ధి, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారని అంతా పాల్గొనాలని కోరారు.

ముగిసిన గొంతేనమ్మ ఉత్సవాలు

టి.నర్సాపురం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగపాడులో వారం రోజులుగా నిర్వహించిన గొంతేనమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

భీమడోలు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అన్నేవారిగూడెంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు భీమడోలు పోలీసులు తెలిపారు. ఆదివారం జరిపిన పోలీస్‌దాడుల్లో పేకాడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10,400 సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

పెదపాడు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనం నడపటం వల్ల జరిగే ప్రమాదాల్లో కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా జరుగుతుందని, వాహనదారులు ఇది గమనించి సురక్షిత ప్రయాణం చేయాలని పెదపాడు ఎస్.ఐ. కట్టా శారదా సతీశ్ తెలిపారు. కలపర్రు టోల్ గేట్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించి, పలు వాహనదారులకు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఇద్దరు మద్యం మత్తులో వాహనాలు నడుపుతూ పట్టుబడటంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధితులకు అండగా ఉంటా

లింగపాలెం, అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల మాచర్లలో రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన లింగపాలెం మండలం అన్నపునేనివారి గూడెం గ్రామానికి చెందిన కొత్తూరి కల్యాణ చక్రవర్తి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ పరామర్శించి ప్రమాద సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కల్యాణ చక్రవర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాశీబుగ్గ ఘటన బాధాకరం

జీలుగుమిల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ శ్రీవెంకటేశ్వరస్వామి ఆయలంలో 9మంది భక్తులు తొక్కిసలాటలో మృతి చెందడం బాధాకరమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రవికుమార్ అన్నారు. ఈ సంఘటనపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.



రోడ్డుకు మరమ్మతులు

కామవరపుకోట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏలూరు - జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని తడికలపూడి గ్రామ పరిధిలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఎట్టకేలకు ఆదివారం గోతులు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టగా ఆయా పనులను మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, సొసైటీ చైర్మన్ తూతా బాలాజీ కుమార్‌ల బృందం దగ్గరుండి ఎక్స్‌కవేటర్‌తో రోడ్డు చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. వారి వెంట కూటమి నాయకులు బొంతు వెంకటేశ్వరరావు, మేరుగు సుందరరావు, ఏనుగు సత్యనారాయణ, నల్లూరి సత్తిబాబు, సిరిగిబత్తుల నాగరాజు, కోలా విశ్వేశ్వరరావు, వెర్రి ధర్మలింగేశ్వరరావు, గుడియాకుల జగదీశ్వరరావు, ఎం.రమేశ్, అనీల్ ఉన్నారు.

దివ్యాంగ టీచర్స్‌ను టెట్ నుంచి మినహాయించాలి

ఏలూరుకార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): అంధులైన టీచర్స్‌ను టెట్ నుంచి మినహాయించాలని ఏపీ దివ్యాంగుల సంక్షేమ సంఘ రాష్ట్ర కన్వీనర్ కె.వీర్రాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, అధ్యక్షులు కుందేటి జయరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్పాం రాంబాబులు కోరారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో దివ్యాంగుల సంక్షేమ సంఘ నాయకులు ప్రతిపాదన మేరకు అంధులైన టీచర్స్‌ను టెట్ నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏలూరు కాలువకు నీరు విడుదల

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ప్రవేశించినా ఏలూరు కాలువలో నీరు లేకపోవడంతో భక్తులు తాము కార్తీక స్నానాలు ఎలా చేయాలంటూ విమర్శించారు. దీంతో భక్తుల మనోభావాలకు అనుగుణంగా గత నెల 26న 'ఆంధ్రజ్యోతి'లో 'నీరు లేని కాలువలో కార్తీక స్నానాలు ఎలా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి ఎట్టకేలకు ఆదివారం నీరు విడుదల చేశారు.

పబ్లిక్ ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం మరియు జంగారెడ్డిగూడెం పట్టణం, అశ్వారావుపేట రోడ్డు, రాజుల కాలనీలో వేంచేసియున్న శ్రీ వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంను దేవదాయ, ధర్మదాయ శాఖ పరిధి లోనికి తీసుకోవడానికి, రిజిస్ట్రేషన్ మరియు పబ్లికేషన్ చేయడానికి తగు చర్యలు తీసుకొనుచున్నాము. దీనిపై ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 10 రోజుల లోపు శ్రీయుత జిల్లా ఎండోమెంట్స్ అధికారి, దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు వారికి లిఖితపూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరుచున్నాము.

డివిజనల్ ఇన్‌స్పెక్టర్
దేవదాయ ధర్మదాయ శాఖ, ఏలూరు

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి : ఎంపీపీ

ముదినేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో వరి పంట నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. మండలంలో వేలాది ఎకరాల్లో పంట దెబ్బతిన్నదని పూర్తిగా నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేలు, పొట్ట దశలో ముంపునకు గురైన పొలాలకు ఎకరానికి రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని ఎంపీపీ కోరారు. డ్రెయిన్లలో గుర్రపు డెక్క తొలగింపు పనులను నీటి సంఘాలకు అప్పగించి యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని డిమాండ్ చేశారు.

మహిళా క్రికెట్ వీక్షణకు ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు

నూజివీడు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా నూజివీడు మహిళా క్రికెట్ అభిమానులకు మ్యాచ్ తిలకించేందుకు మంత్రి స్క్రీన్ ఏర్పాటు చేశారు. నూజివీడు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో స్క్రీన్ ఏర్పాటు చేయగా దక్షిణాఫ్రికా-భారత్ మధ్య ఫైనల్ మ్యాచ్‌ను చూస్తూ పట్టణ క్రికెట్ అభిమానులు తమ మద్దతు తెలిపారు. కూటమి మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

శెట్టిబలిజ వర్గీయులు విద్యావంతులు కావాలి

కలిదిండి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శెట్టిబలిజ వర్గీయులంతా విద్యావంతులు కావాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, నియోజకవర్గ శెట్టిబలిజ సంఘ అధ్యక్షుడు గుత్తుల ఈశ్వరరావు అన్నారు. ఆదివారం మూల్లంక పెద్దింటమ్మ ఆలయం వద్ద నియోజకవర్గ శెట్టిబలిజ సంక్షేమ సంఘం వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుల వృత్తులతోపాటు పిల్లలను విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. గౌడ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, టీడీపీ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, మండల అధ్యక్షుడు జోగిరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ అక్కుల బోసు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ ఎంపీపీ బండి తులసీరావు పాల్గొన్నారు.

గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో..

ముదినేపల్లి: గురజ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆదివారం కార్తీక వన సమారాధన జరిగింది. వందలాది మంది ఆలయంలో పూజలు జరిపి వనసమారాధనలో పాల్గొన్నారు. గురజ మాజీ సర్పంచ్ కామినేని వెంకటేశ్వరరావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ బొర్రా చలమయ్య, టీడీపీ నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, వీరాబత్తిన సుధ, అడుసుమిల్లి రాము, వీరిశెట్టి కొండల, ఉప్పలపాటి ప్రవీణ్ కుమార్, తదితరులు కార్తీక పూజలు నిర్వహించారు.

కూలిన ఇంటికి పరిహారం ఇవ్వాలని ఆందోళన

చాట్రాయి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపానుకు మండలంలోని చిత్తపూరు తూర్పు దళితవాడ కాలనీలో పూరిల్లు కూలి నిరాశ్రయులైన ఆడిమెల్లి కృపకు ప్రభుత్వం పరిహారం మంజూరు చెయ్యాలని ఆదివారం కూలిపోయిన ఇంటి వద్ద సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఆందోళన చేశారు. నాయకులు మాట్లాడుతూ వీఆర్వో వచ్చి కూలిపోయిన ఇంటిని పరిశీలించి వెళ్ళినా ఇంత వరకు బాధిత కుటుంబానికి కనీసం బియ్యం, నిత్యావసర వస్తువులు అందించ లేదని ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బాధిత కుటుంబానికి పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లిబరేషన్ నాయకులు కలపాల వెంకటేశ్వరరావు, చాట్ల బాబూరావు, అడిమెల్లి వెంకటేశ్వరరావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.



కరుణాపురంలో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

తపన చౌదరి పుట్టినరోజు వేడుకలు

చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): చనుబండ శివారు కరుణాపురంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి (తపన చౌదరి) జన్మదిన వేడుకలను బీజేపీ సీనియర్ నాయకుడు బుర్రి శ్రీకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక చర్చి ఆవరణలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచి, మొక్కలు నాటారు. తపన ఫౌండేషన్ ద్వారా తాగునీరు, మహిళలకు కుట్టు శిక్షణ, విద్యార్థులకు ఉపకార వేతనాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. బీజేపీ నాయకులు చాగంటి వాసుదేవరావు, కొక్కెరగడ్డ కన్నయ్య, సునీల్, రత్నం, రాజు, రాజేష్, గత్తం రాజు తదితరులు పాల్గొన్నారు.


7న సుబ్రహ్మణ్యస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



వరహాపట్నంలో ఆలయం నిర్మిస్తున్న దృశ్యం


కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వరహాపట్నంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ నిర్మాణాన్ని శరవేగంగా పూర్తిచేస్తున్నారు. 7వ తేదీ ఉదయం 10.35 గంటలకు స్వామివారి విగ్రహ పునఃప్రతిష్ఠతో పాటు గణేశుడు, శివుడు, నవగ్రహ, శిఖర, ధ్వజ ప్రతిష్ఠామహోత్సవాలను నిర్వహించనున్నారు. నిర్మాణ పనులను ఇటీవల ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పరిశీలించారు. 65 ఏళ్ల నాటి ఈ ఆలయం కాలక్రమేణా పల్లంగా మారడంతో పునఃనిర్మిస్తున్నారు.

సంయుక్త కార్యదర్శిగా సర్వేయర్ రామకృష్ణ




ఆగిరిపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ సర్వే ఎంప్లాయిస్ అసోసియేషన్ నూజివీడు డివిజన్ యూనిట్ తరఫున సంయుక్త కార్యదర్శిగా ఆగిరిపల్లి మండల సర్వేయర్ రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికల్లో తాను ఎన్నికైనట్టు, ఎన్నికల అధికారి ఎన్. విజయరాజు నియామకపత్రం అందించినట్టు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో సత్ఫలితాలు



మండవల్లి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ ఫీల్డ్ మాస్టర్ ట్రైనర్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో బ్రహ్మాస్త్రం తయారు చేశారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ వరిలో ఆకుముడత, మినుము, పెసర తదితర పంటల్లో లద్దెపురుగు నివారణకు బ్రహ్మాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు కషాయాలు, ద్రావణాలు అందుబాటులో ఉన్నాయని ఎక్కువ మోతాదులో కావాల్సిన వారు తనను సంప్రదించాలని, వాటిపై శిక్షణ కూడా ఇస్తున్నామని అన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



కోటపాడు మెయిన్ రహదారి దుస్థితి (ఫైల్)

కోటపాడు రహదారికి మహర్దశ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలకు మండలంలోని కోటపాడు గ్రామంలో ప్రధాన రహదారి పెద్ద పెద్ద గోతులు పడి బురదకయ్యగా మారి కొన్ని నెలల పాటు ప్రజలు నరకయాతలు అనుభవించారు. మంకొల్లు-కోటపాడు ఆర్అండ్‌బీ రోడ్డు పరిధిలోని ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమై చెరువును తలపించింది. దీనిపై సెప్టెంబరు 25న 'ఆంధ్రజ్యోతి'లో రోడ్లు..పాట్లు శీర్షికన కథనం ప్రచురితం అయ్యింది. గ్రామంలో డ్రెయిన్లు లేకపోవటం, కచ్చా డ్రెయిన్లు పూడిపోవటం, బయటకు పోయే దారి లేక వర్షం నీరు రోడ్డుపైనే నిలిచిపోయింది. దీనికి తోడు ఇళ్ళలో వాడిన మురుగునీరు కూడా నిలిచి వర్షం నీటిలో కలిసి అపరశుభ్రత తాండవించి ప్రజల అవస్థలు వర్ణనాతీతం. నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఆదేశాలతో ఆర్అండ్‌బీ అధికారులు కోటపాడు పాత రామాలయం నుంచి రైస్‌మిల్లు వరకు 1.50 కిలో మీటర్లు రహదారి మెరక చేసి బీటీ రోడ్డు నిర్మించటంతో ప్రజల ఇబ్బందులు తొలగాయి. అధ్వాన రహదారికి బాగుపడటంతో వాహనచోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణం తరువాత కోటపాడు మెయిన్ రహదారి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సారథి

సకాలంలో పనులు పూర్తి చేయకుంటే.. కాంట్రాక్టులు రద్దు చేస్తా

మంత్రి పార్థసారథి హెచ్చరిక

నూజివీడు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయకపోతే కాంట్రాక్టులను రద్దు చేసేందుకు కూడా వెనుకాడనని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో నూజివీడు మున్సిపల్ పరిధిలో మంజూరైన పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ ప్రస్తుతం మంజూరైన పనులను డిసెంబరు 10వ తేదీ నాటికి పూర్తి చేసేలా కృషి చేయాలని ఆదేశించారు. నూజివీడు పట్టణ పరిధిలో మరో రూ. 8 కోట్ల నిధులను మంజూరు చేయించేందుకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రితో తాను మాట్లాడతానని నూజివీడు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. గతంలో టీడీపీ హయాంలో పూర్తయిన పనులకు నిధులు విడుదల కాకపోవడంపై మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పేదలకు వరం

ఆగిరిపల్లి: నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు గొప్ప వరమని మంత్రి పార్థసారథి అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన దుర్గారావు, స్వామికి కొత్తగా మంజూరైన దివ్యాంగుల పింఛను మంత్రి నూజివీడులో అందజేశారు. మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం దిశగా రాష్ట్రానికి సుపరిపాలన అందిస్తున్నామని తెలిపారు.

గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తరలింపు..

రహదారి ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని స్వయం గా తన కాన్వాయ్ వాహనంలో ఆసుపత్రికి తరలించి మంత్రి మానవత్వాన్ని చాటుకున్నారు. విజయవాడ నుంచి నూజివీడు వస్తున్న క్రమంలో రహదారి ప్రమాదాన్ని గమనించిన ఆయన క్షతగాత్రుడు జ్యోతిబాబును తన వ్యక్తిగత సిబ్బందితో కాన్వాయ్ వాహనంలో విజయవాడ సిద్ధార్థ ఆసుపత్రికి పంపించారు. ఫోన్‌లో క్షతగాత్రుడికి చికిత్స అందించాలని ఆసుపత్రి సిబ్బందికి మంత్రి సూచించారు.



ముంపులోనే రహదారి

» వాహనదారుల పాట్లు.. » ఆక్వా చెరువుల వల్లే ముంపు?





నీట మునిగిన వరహాపట్నం-సీతనపల్లి ఆర్అండ్‌బీ రహదారి (ఇన్‌సెట్) వాహనం మొరాయించడంతో నడిపించుకుంటూ వస్తున్న వాహనదారుడు

కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువులతో డ్రెయిన్లు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవడంతో ఎక్కడికక్కడే ముంపుతో రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రహదారులు జలమయంగా మారాయి. రహదారిపై మూడు అడుగుల మేర నీరు నిలబడడంతో ప్రజలు రాకపోకలు సాగించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఆ నీటిలో ప్రయాణించా లంటే ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురై మధ్యలోనే నిలిచిపోతున్నాయి. దీనితో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. దివ్యాంగుల మూడు చక్రాల బైకు సైతం నీటిలో గోతుల్లో పడి మరమ్మ తులకు గురై ఇబ్బందులకు గురయ్యారు. రూ.కోట్ల రూపాయిలతో రహదారులు నిర్మాణం చేసినప్పటికీ రైతులు స్వార్థంతో ముంపు సమస్య తలెత్తి రహదారి నిర్మాణం చేసిన అనతికాలంలోనే మరమ్మతులకు గురవుతుంది. కైకలూరు మండలం అగ్రహారం నుంచి వరహాపట్నం వెళ్లే రహదారి, వరహాపట్నం నుంచి సీతనపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారిలో ఈ దుస్థితి నెలకొంది. రోజుల తరబడి ఆర్అండ్‌బీ రహదారిపై నీరు ఉండడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడి వాహనదారులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. రహదారి నిర్మించిన అనతికాలంలోనే ఈ ముంపుతో పెద్దపెద్దగోతులు ఏర్పడ్డాయి. ఈ రహదారిలో ప్రయాణించే ద్విచక్ర వాహనాలు ఆ నీటిలో మధ్యలోనే మొరాయిస్తున్నాయి. రహదారులను ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ పరిశీలించి ముందు ముంపు సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే రైతులు సైతం తమ చెరువులోని నీటిని డ్రైన్లలోకి వెళ్లే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. లేకుంటే రైతులపైన కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇకనైనా రైతుల్లో మార్పు వచ్చి మురుగుబోదెలను ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు.

తీరని చింత!

(5వ పేజీ తరువాయి)

రావాల్సి ఉంది. జోన్-3 కింద ఉన్న 2.10 లక్షల ఎకరాల ఆయకట్టును చింతపూడి ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలలతో స్థిరీకరించేలా డిజైన్ రూపొందించారు. ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే ఈ పథకాన్ని పూర్తి చేస్తానని ప్రస్తుత నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణ, సమాచార మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారని ఆ మేరకు హామీని అమలు చేయాలని రైతులు కోరుతు న్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సుప్రీం కోర్టులో, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు పరిష్కారా నికి కృషి చేయాలని రైతులు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అనుమతికి కృషి

చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుంచి కృషి జరుగుతోంది. వీలైనంత త్వరగా పనులు పునఃప్రారంభించాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోంది.

- చిన్నబాబు, ఈఈ, చింతలపూడి ఎత్తిపోతల పథకం

కూటమి సర్కార్‌పై నమ్మకంతో ఉన్నాం



చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందని నమ్మకంతో ఉన్నాం. వైసీపీ ప్రభుత్వం తీరు వల్ల తీవ్ర నష్టం జరిగింది. గోదావరి జలాలు మెట్ట భూముల్లోకి వస్తే పంటలు పండి ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుంది.

- మరిడి వెంకటేశ్వరరావు(చిట్టిబాబు) ఆయకట్టు రైతు, పోలవరం, చాట్రాయి మండలం.

చిగురించిన ఆశలు

(5పేజీ తరువాయి)

పరిహారం అందుతుందని, తమ కష్టాలు తీరుతాయని నిర్వాసిత కుటుంబా ల్లో ఆనందం నెలకొంది. ప్రాజెక్టు పరిధిలోని ఆరు మండలాల్లో 45.72 కాంటూరు లెవెల్‌లో 201 గ్రామాలు ఉండగా సుమారు 58 వేలు కుటుంబాలున్నాయి. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో వీరందరికీ న్యాయం జరగనుంది.

మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలి



మండలాన్ని యూనిట్‌గా తీసుకుని గ్రామాలకు పరిహారం అందించాలి. అప్పుడే ప్రతి నిర్వాసితునికి న్యాయం జరుగు తుంది. అధికారులు వేగవంతంగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసున్నట్టే పునరావాస ప్రక్రియ పూర్తి చేయాలి. నిర్వాసితులకు అన్ని విధాల న్యాయం చేయాలి.

- యర్రంశెట్టి నాగేంద్రరావు, సీపీఎం జిల్లా నాయకుడు

45.72 కాంటూర్ లెవెల్‌లో పరిహారం అందించాలి



45.72 కాంటూర్ లెవెల్‌లో ముంపు గ్రామాలకు పరిహారం అందిస్తామని మంత్రి నిమ్మల స్పష్టం చేశారు. ఆ మేరకు అమలు చేస్తే అన్ని గ్రామాల నిర్వాసితులకు న్యాయం జరుగుతుంది. గోదావరి వరదలకు ఏటా ముంపుకు గురవుతున్న నిర్వాసితుల బాధలు తీరుతాయి.

- కొన్నె లక్ష్మయ్య, సీపీఐ మండల కార్యదర్శి



శ్రీహరి జల విహారం

ద్వారకాతిరుమల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): సుదర్శన పుష్కరిణిలో హంస వాహనంపై చిన వెంకన్న ఉభయ నాంచారులతో ఆదివారం రాత్రి జల విహారం చేశారు. క్షీరాబ్ధి ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన తెప్పోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. విద్యుద్దీపకాంతులు, కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ, బాణసంచా, అర్చకుల వేదఘోషల నడుమ జరిగిన ఉత్సవం కనువిందు చేసింది. ముందుగా ఆలయంలో తొళక్క వాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా శ్రీవారి వాహనం పురవీధులకు పయనమైంది. తిరువీధి సేవ అనంతరం వాహనాన్ని సుదర్శన పుష్కరిణిలో హంస వాహనంగా అలంకరించిన తెప్పలో స్వామి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రాజా ఎస్వీ సుధాకరరావు, ట్రస్టీ ఎస్‌వి నివృతరావు, ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ నడుమ తెప్ప పుష్కరిణిలో విహరించింది. పుష్కరిణి మధ్యనున్న మండపంలో స్వామి అమ్మవార్ల నుంచి అర్చకులు పూజలు చేశారు.



కైకలూరులో రుద్రహోమం

లక్ష బిల్వార్చన.. రుద్రహోమం

ఘనంగా కార్తీక పూజలు, వ్రతాలు

కైకలూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో కొలువైన పార్వతీసమేత నగరేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రుద్రహోమం వైభవోపేతంగా నిర్వహించారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా స్వామివారికి బిల్వపత్రాలతో వేద పండితులు పూజలు నిర్వహించారు. అనంతరం రుద్రహోమాన్ని జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు పైడిమర్రి రమేష్, పెనుమూడి గంగాధరరావు, బొగ్గవరపు శ్యాంప్రసాద్ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని అందజేశారు.

వైభవంగా క్షీరాబ్ధి ద్వాదశి పూజలు

ముదినేపల్లి: కార్తీక మాసం క్షీరాబ్ధి ద్వాదశి సందర్భంగా మండలంలోని శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. అల్లూరులోని పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామికి పూజలు, అభిషేకాలు జరిపారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమేశ్వర స్వామికి అర్చకుడు ఐలూరి సుబ్బరాయ శర్మ అభిషేకాలు జరిపి ఆకాశ దీప కార్యక్రమం నిర్వహించారు. గురజ రామలింగేశ్వరస్వామి, పెద గొన్నూరు శ్రీ మల్లేశ్వరస్వామి, సింగరాయపాలెం శ్రీ అమృతేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. తులసీ మాతకు పూజలు జరిపారు.

●కోమర్రులో పాండురంగస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం భక్తులు విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొడవళ్ల రాంబాబు ఆధ్వర్యంలో అర్చకుడు చంద్రశేఖర్ శర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైభవంగా కార్తీక దామోదర వ్రతం

వణుదుర్రులోని రాధాకృష్ణాశ్రమంలో ఆదివారం కార్తీక దామోదర వ్రతం వైభవోపేతంగా జరిగింది. ఆశ్రమ పీఠాధిపతి పురుషోత్తమానందగిరి స్వామి (వెంకన్న స్వామి) ఆధ్వర్యంలో గెడ్డం నాగమల్లేశ్వరరావు, పెద్ది వీరయ్య దంపతులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. హోమాలు జరిగాయి. భక్తు లు పెద్ద సంఖ్య లో పాల్గొని గోపూజ, ఉసిరి చెట్టుకు పూజలు, ఆశ్రమంలో రాధాకృష్ణులకు పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ఆశ్రమాల పీఠాధిప తులు యోగిన అంబికేశ్వర స్వామి, కరుణానందగిరి స్వామి, కృష్ణానందగిరి స్వామి, శివ ప్రియనందగిరి స్వామి ఆధ్వర్యంలో రాధా కృష్ణ కల్యాణం జరిపించారు. మహిళలు భగవద్గీత పారాయణం నిర్వహించిన అనంతరం ఆశ్రమం వద్ద కార్తీక అన్న సమారాధాన జరిగింది. ఆశ్రమ నిర్వాహకుడు గెడ్డం మల్లికార్జునరావు పర్యవేక్షించారు.



అల్లూరులో సోమేశ్వరస్వామికి అభిషేకం

టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మారేష్



చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఎస్సీ సెల్ చాట్రాయి మండల అధ్యక్షుడిగా నరసింహారావు పాలెం మాజీ సర్పంచ్ గార్లపాటి మారేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మంత్రి పార్థసారథి మారేష్‌కు నియామక పత్రం అందజేశారు. తనపై ఎంతో నమ్మకంతో పదవి అప్పగించిన మంత్రి పార్థసారథికి, టీడీపీ నాయకులకు మారేష్ కృతజ్ఞతలు తెలిపారు. అందరి సహకారంతో మండలంలో అన్ని గ్రామాల్లో ఎస్సీ సామాజిక వర్గంలో టీడీపీని బలోపేతం చెయ్యటానికి చిత్తశుద్ధితో పని చేస్తానని మారేష్ చెప్పారు.

వైసీపీ కొవ్వొత్తుల ప్రదర్శన

నూజివీడు టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ తొక్కిసలాటలో మరణించిన భక్తుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ సభ్యుడి కుటుంబానికి సాయం

చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరం పీఏసీఎస్ సభ్యుడు, రైతు పిల్లి చిన్న వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. పీఏసీఎస్ చైర్మన్ యర్రా ప్రసాదరావు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, ఆదివారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేలు సాయం అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులు మిద్దె పార్థు, పజ్జూరి చెన్నారావు, బిలుగుది జయరాజు పాల్గొన్నారు.



వైష్ణవి ఆర్థిక సాయం

ముదినేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెదపాలపర్రు గ్రామంలో శనివారం అనారోగ్యం తో మృతిచెందిన మారుముళ్ల సీతారత్నం కుటుంబానికి అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ. 5 వేలు అందజేశారు. ఆదివారం వైష్ణవి తరఫున ఆమె తండ్రి డాక్టర్ మనోజ్ మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి నగదును అందజేశారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి సాయం



చాట్రాయి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ గ్రామ టీడీపీ కార్యదర్శి పిల్లి ప్రకాశరావు ఇటీవల మృతి చెందారు. ఆదివారం పీఏసీఎస్ అధ్యక్షుడు మోరంపూడి శ్రీనివాసరావు మృతిడి కుటుంబాన్ని పరామర్శించి రూ 5 వేలు సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నక్కా రాము, గవర వెంకటేశ్వరరావు, బన్నే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

బైక్ కొనేందుకు భార్య సొమ్మివ్వలేదని..



రమేష్ (ఫైల్)

మునునూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): బైక్ కొనేందుకు భార్య నగదు ఇవ్వలేదని పురుగుమందు తాగి ఆత్మహత్య కు పాల్పడిన వ్యక్తి చికిత్స పొం దుతూ ఆదివారం మృతి చెందా డు. మండలంలోని సూరేపల్లికి చెందిన ఆముదాల రమేష్ (52) కుటుంబం కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. కొంతకాలంగా రమేష్ మద్యానికి బానిసై పనులకు వెళ్ళకుండా, కొత్త బైక్ కొనుక్కొనేందుకు భార్యను నగదు ఇవ్వమని ఇబ్బంది పెడుతున్నాడు. ఈ నెల 1న భార్య శ్యామల రూ. 50 వేలు సమకూర్చి ఇవ్వగా, తాను లక్ష అడిగితే రూ. 50 వేలు ఇస్తావా అని రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో శ్యామల మరో రూ. 50 వేలు తీసుకువచ్చేందుకు అదే రోజు మధ్యాహ్నం రమణక్కపేటలో ఉన్న బ్యాంకుకు వెళ్లగా రమేష్ ఇంటిలో ఉన్న పురుగులు మందును తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

10 మంది జూదరుల అరెస్టు

ముదినేపల్లి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విశ్వనాద్రిపాలెంలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడిలో పది మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.4100 నగదును స్వాధీనం చేసుకున్నారు.